ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0



శరన్నవరాత్రులు ప్రారంభం

» బాలా త్రిపుర సుందరీదేవిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల వద్ద, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల వద్ద దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ద్వారకాతిరుమల క్షేత్రదేవత కుంకుళ్లమ్మ బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. జపమాలను ధరించి దర్శనమిచ్చే అమ్మవారిని బ్రహ్మచారిణిగా ఆరాధిస్తారు.

శభాష్.. మా..స్టార్

నిరుపేద అభ్యర్థులకు ఎమ్మెల్యే చింతమనేని

ఉచిత డీఎస్సీ కోచింగ్

» రూ.60 లక్షలతో నాలుగు నెలలపాటు 500 మందికి శిక్షణ.. ఉచిత స్టడీ మెటీరియల్.. భోజన సదుపాయం
» టీచర్లుగా ఉద్యోగం సాధించిన 38 మంది
» చాలా గర్వంగా వుందన్న ప్రభాకర్

డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

■ లోపలి పేజీలో..



GST ఉత్తేజం!

» ఎలక్ట్రానిక్ దుకాణాల్లో కొనుగోళ్ల హడావుడి
» నిత్యావసరాలు తగ్గడానికి మరింత సమయం
» ఎల్ఐసీ ఏజెంట్ల సంబరాలు.. ప్రీమియం కట్టేందుకు పాలసీదారుల క్యూ
» 350 సీసీ కంటే తక్కువ ఉన్న బైక్‌లకు డిమాండ్

మార్కెట్లో ఇప్పుడు జీఎస్టీ సందడి కనిపిస్తోంది. జీఎస్టీ తగ్గింపుతో కొన్ని రకాల వస్తువులు బాగా తగ్గాయి. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తు వులు, బైక్ షోరూంల వద్ద సందడి నెలకొంది. కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. ఎప్పుడు నుంచో కొందామనుకున్నవారు జీఎస్టీ తగ్గింపుతో ఒక్కసారిగా షాపుల వైపు పరుగులు తీశారు. బీమా కార్యాలయాల్లో ఏజెంట్లు కేక్‌ల కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ధరలు తగ్గడంతో ఏలూరులో కిటకిటలాడుతున్న సోనోవిజన్ దుకాణం

ఎల్ఐసీ ప్రీమియంపైన జీఎస్టీని తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం సోమవారం అమల్లోకి రావడంతో జీవిత బీమా ఏజెంట్లు, పాలసీ దారులు ఆనందకం వ్యక్తం చేశారు. బ్రాంచి కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచారు. ఎంతో కాలంగా జీఎస్టీని తొలగించాలని దేశవ్యాప్తంగా జీవిత బీమా ఏజెంట్లు, పాలసీ దారులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. గతంలో బీమా ప్రీమియంపై జీఎస్టీ పెట్టడం వల్ల బీమా చేయాలంటే అదనపు భారం పడేది. దీని వల్ల బీమా చేయడానికి ఎక్కువ ముందు కొచ్చేవారు కాదు. దీంతో బీమా వ్యాపారం తగ్గింది. ఎట్టకేలకు కేంద్రం జీవిత బీమా, ఆరోగ్యబీమాపై జీఎస్టీని తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఏజెంట్లలో సంబరాలు మిన్నంటాయి. ఉదయం నుంచి బీమా కార్యాలయాల వద్ద ప్రధాని మోదీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి కొన్ని ప్రాంతాల్లో పాలభిషేకాలు చేశారు. మరి కొన్నిచోట్ల స్వీట్లు పంచారు. కేక్‌లు కట్ చేశారు.ఉదయం నుంచి క్యాష్ కౌంటర్ వద్ద ప్రీమియం కట్టేందుకు పాలసీదారులు క్యూ కట్టారు. ఆన్‌లైన్ పేమెంట్‌లు ఎక్కువగా జరిగినట్టు బీమా ఉద్యోగులు ధ్రువీకరిస్తున్నారు.

బైకులకు భలే డిమాండ్

నిన్న, మొన్నటి వరకు నిస్తేజంగా ఉన్న ఆటో మొబైల్ రంగం పుంజుకొంటోంది. జీఎస్టీ ధరలను తగ్గించి పాతస్టాకును అమ్మకాలు సాగిస్తున్నా రు. కొత్త బ్యాచ్‌ల కింద సరుకు దిగుమతి కావాల్సి ఉంది. 350 సీసీ కన్నా తక్కువ ఉన్న బైకులకు మంచి డిమాండ్ వచ్చింది. జీఎస్టీ మార్పుకాక ముందు ధరలతో పోల్చుకుంటే ప్రతి మోటారు సైకిల్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు తగ్గింది. హీరో మోటార్స్‌కు సం బంధించిన వాహనాల్లో ఎక్కువగా అమ్ముడు పోయే గ్లామర్ విషయానికి రూ.1,12,000 ఉండే వాహనం ఇప్పుడు రూ.లక్షకే ఇచ్చే స్తున్నారు. స్పెండర్ రూ.1,0 4,000 ఉంటే రూ.90 వేలకు అమ్మేస్తున్నారు. హోండా మోటారు వెహికల్స్‌కు విషయానికి వస్తే యూనికార్న్ రూ.1,46,000 ఉంటే రూ.1,36, 000కు, షైన్ రూ.1,05,000 ఉంటే 97,500కు, యాక్టివా-125 రూ.1,18.000 ఉంటే రూ.1,12,000 అమ్మేస్తున్నారు. 350 సీసీ కంటే ఎక్కువ సీసీ ఉన్న మోటారు సైకిళ్ల ధరలు పెరిగాయి. 350 సీసీ కింద ఉన్న వాహనాల సేల్స్ పెరిగిందని, అయితే అనుకున్నంతలేదని వ్యా పారులు చెబు తున్నారు. హీరో బైక్స్‌ను ఫ్లిప్‌కార్టు, అమెజాన్‌లో బుక్ చేసుకున్న వారు సగటున రూ.6వేల రూ.15 వేల వరకు లాభ పడుతున్నారు. అందులో బుక్ చేసుకున్న వాటికి స్థానిక హీరో షోరూమ్‌ల్లోనే డెలివరీ అందుబాటులో తీసుకొచ్చారు. ఈ ఏడాది గతే డాదితో పోల్చుకుంటే బైక్‌లపై 10-15 శాతం అమ్మకాలు పెరిగే అవకాశం ఉందని ఏలూరు లోని సాయి స్వర్ణ మోటార్స్ జీఎం సోమేశ్వర రావు అభిప్రాయపడ్డారు.

> **ఊపందుకోనున్న నిర్మాణ రంగం**
>
> సిమెంట్‌పై జీఎస్టీ 10 శాతం తగ్గించడంతో నిర్మాణ రంగం మంచి ఊపందుకుంటుందని బిల్డర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 10 శాతం తగ్గడంతో నిర్మాణ రంగంపై భారం తగ్గుతుందని, దీంతో ఇళ్ల కట్టుకునేవారు ముందుకొస్తారని భావిస్తున్నారు. ఎంతో కాలంగా సిమెంట్ ధరలు మండుతున్నాయి. ఇసుక తగ్గినా సిమెంట్ తగ్గకపోవడంతో భవనాలు నిర్మించుకునేవారు ఆగారు. ఇప్పుడు నిర్మాణ రంగానికి ఊపు వస్తుందని బిల్డర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరులో ఒక చెప్పుల దుకాణం వద్ద ధరలు తగ్గాయంటూ కట్టిన ఫ్లెక్సీ

అందుబాటులోకి రాని నిత్యావసరాలు

నిత్యావసరాల ధరలు ఇంకా తగ్గించినవి అందుబాటులోకి రాలేదు. మరో వారం రోజులు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. పాత స్టాక్ అయ్యే వరకు కొత్త స్టాకును తీసుకురాకూడదనే ఉద్దేశ్యంతోనే పాత స్టాకును వదిలించుకునే ప్రయత్నంలో వ్యాపారులున్నారు. సన్‌ఫ్లవర్ రూ.150, పామాయిల్ రూ.115 తదితర ధరలు ఇంకా దిగిరాలేదు. సబ్బులు, షాంపూలు, ఇతర ఫేస్‌క్రీములు ధరలు తగ్గుముఖం పట్టలేదు. ప్రధానంగా హిందూస్థాన్ లీవర్ కంపెనీ ఉత్పత్తులే ఎక్కువగా ఉంటాయి. వారు ప్రతీ వారం, లేదా 10 రోజులకు స్టాక్ ఇండెంట్‌లను తీసుకెళుతుంటారు. దీనివల్ల కూడా తగ్గిన ధరలకు సంబంధించిన ఉత్పత్తులు నెలాఖరుకు స్టాక్ పెట్టే అవకాశం ఉంది. పాలతో తయారు చేసే ఉత్పత్తులపైన జీఎస్టీ ఎత్తివేతతో కొంత మేరకు తగ్గించి (మిగతా 8వ పేజీలో)

జీఎస్టీ సంస్కరణలతో మేలు

- ఎంపీ పుట్టా మహేశ్ కుమార్



ఏలూరు టూటౌన్ : జీఎస్టీ సంస్కరణలతో రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. సంస్కరణల్లో భాగంగా ఎన్నో వస్తువుల ధరలు తగ్గాయ న్నారు. పండుగ సమయాల్లో జీఎస్టీ తగ్గించ డం వల్ల ప్రజలు సంతోషంగా ఉన్నార న్నారు. ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో ఎన్నో సాహసోపేత సంస్కరణలను తీసుకొచ్చార న్నారు. 28 శాతం, 12 శాతం శ్లాబ్‌లను ఎత్తివేయడం హర్షనీయమన్నారు. అనేక నిత్యావసర వస్తువులపై ఐదు శాతానికి పన్ను తగ్గించడం కేంద్రానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. వ్యవసాయ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో ఆనందోత్సవాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కార్లు, ఏసీలు, ఫ్రిజ్‌లపై 28 నుంచి 18శాతానికి తగ్గడం ఎంతో ఉపశమనమన్నారు.

పేదలకు ప్రయోజనం



జీఎస్టీ తగ్గింపు వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. గతంలో జీఎస్టీ భారం ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు సామాన్యుడు కొనుగోలు చేసే స్థాయిలో ధరలు తగ్గాయి. ఏసీ కొనాలంటే భయంగా ఉండేది. ఇప్పుడు ధరలు తగ్గాయి.

- ఆర్.శ్రీనివాస్, రైతు

నిర్మాణ రంగానికి ఊతం



జీఎస్టీ తగ్గింపుతో నిర్మాణ రంగానికి ఊతమిచ్చినట్లుంది. నిర్మాణ రంగం కోలుకుంటుంది. ముఖ్యంగా సిమెంట్‌పై జీఎస్టీ తగ్గించడం మంచి పరిణామం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న నిర్మాణ రంగానికి సిమెంట్‌పై జీఎస్టీ తగ్గించడం ఊపిరి పోసింది. సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- భోగిరెడ్డి ఆదిలక్ష్మి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి



పొంగిపొర్లుతున్న ముగ్గురాళ్ల వాగు

అల్పపీడనం.. విస్తారంగా వర్షాలు

» ఈదురుగాలులతో నేలకొరుగుతున్న భారీ వృక్షాలు
» ద్వారకాతిరుమల మండలంలో 83.2 మి.మీ వర్షపాతం
» చింతపాడులో కొబ్బరిచెట్టుపై పిడుగు
» రాజవరంలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

ఏలూరుసిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, రెండురోజుల పాటు వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. ఈనెల 25న తూర్పు, మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని, మూడు రోజుల వ్యవధిలో ఏర్పడుతున్న రెండు అల్పపీడనాల కారణంగా ఈనెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు కోస్తా జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ద్వారకాతిరుమల మండలంలో 83.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 26.7 మి.మీ నమోదైంది. పెదపాడు 80.6, ఆగిరిపల్లి 66.8, బుట్టాయిగూడెం 56.6, కైకలూరు 54.2, జంగారెడ్డి గూడెం 50.6, మండవల్లి 36.8, ఉంగుటూరు 34.2,టి. నరసాపురం 33, కలిదిండి 30.4, భీమడోలు 30, చాట్రాయి 28.6, దెందులూరు 23.6, నిడమర్రు 18.4, చింతలపూడి 18.2, ఏలూరు అర్బన్ 17.6, ముదినేపల్లి 16.6, వేలేరుపాడు 14.2, ఏలూరు రూరల్ 12.6, నూజివీడు 10.6, కామవరపుకోట7.6, పెదవేగి 7.2, లింగపాలెం 4.8, కుక్కునూరు 3.4, కొయ్యలగూడెం 3.2, పోలవరం 1.8 జీలుగుమిల్లిలో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతాలు నమోదైయ్యాయి.



పిడుగు పడి మృతి చెందిన గేదెలు

టి.నరసాపురం: మండలంలో భారీవర్షానికి ముగ్గురాల వాగు, జలవాగులు పొంగిప్రవహిస్తున్నాయి. వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెవెన్యూ, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించారు.

పెదపాడు : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన జోరువాన, ఈదురుగాలులతో తోటగూడెం, ఫునుకొల్లు రహదారులలో కూలిన చెట్లతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగగా, స్థానికులు చెట్ల కొమ్మలు తొలగించారు. పునుకొల్లు, రాజుపేట తదితర గ్రామాలకు విద్యుత్తు నిలిచిపోగా సిబ్బంది పునరుద్ధరించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణ మొత్తం వర్షంనీరు చేరింది.

మండవల్లి : దేవీచింతపాడులో ఆదివారం రాత్రి గృహాల సమీపంలో కొబ్బరిచెట్టుపై పిడుగు పడటం గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం లేకపోయినా జోరు వానలోను మంటలు చెలరేగాయి.

ఆగిరిపల్లి : మండలంలో ఆదివారం రాత్రి రాజవరంలో తోట రాజబాబుకు చెందిన రెండు గేదెలు ఇంటి వద్ద కట్టివేసి ఉండగా పిడుగు పడడంతో మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.



గండిచెరువుచెరువు-రాజుపేట రోడ్డుపై నేలకొరిగిన చెట్టు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రతి అర్జీని ఛాలెంజ్‌గా పరిష్కరించండి : కలెక్టర్

ఏలూరు,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): 'జిల్లా అధికారులకు వచ్చిన ప్రతి వినతిని ఛాలెంజ్‌గా తీసుకుని పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి.. అర్జీదారులను ఆప్యాయతతో పలకరించి సమస్యలను విని చక్కని పరిష్కారాన్ని చేపట్టాలి' అని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో డీఆర్వో వి.విశ్వేశ్వర రావు, ఇతర అధికారులతో కలిసి సోమవారం ప్రజల నుంచి పీజీఆర్ఎస్‌లో వినతులను స్వీకరించారు. బుట్టాయగూడెం మండలం నూతిరామన్న పాలెంలో దారావతు సుబ్బారావు, వడిత్యా అరవాల రాజు ఆధార్‌లతో 25 మంది హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ అయ్యారు. వారు ఎవరు మాకు తెలియదని, దీనిపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా పరిష్కారం చేయకుండానే దాన్ని క్లోజ్ చేశారని ఎస్టీ బంజారా లంబాడీ సుగాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గగ్గులోతు కృష్ణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మ్యాపింగ్ తప్పు చేసిన వారికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదే శించారు. అధికారులకు మొత్తం 306 అర్జీలందాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

చట్ట ప్రకారం చర్యలు : ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావులతో కలసి నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 57 మంది ఫిర్యాదులను అందించారు.

ఇన్‌స్పైర్ సైన్సు ప్రాజెక్టుల అప్‌లోడ్‌కు తుది గడువు 30

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టుల కార్యక్రమానికి సోమవారం నాటికి జిల్లాలో రెండు వేలు నామినేషన్లను నిర్ణీత వెబ్‌సైట్ లింక్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తయిందని జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. ప్రాజెక్టుల అప్‌లోడ్‌కు ఈనెల 30వ తేదీ వరకు గడువును పొడిగించినందున ఈ సంఖ్య మరో 300 వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇన్‌స్పైర్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు, సమస్యలున్నా ఏలూరులోని జీఎంసీ బాలయోగి సైన్స్‌పార్కులో నేరుగా లేదా ఫోన్ ద్వారా సంప్రదించాలన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

» విద్యుత్ ఉద్యోగుల భారీ ర్యాలీ.. కలెక్టరేట్ వద్ద ధర్నా



ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): విద్యుత్ ఉద్యో గుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు హెచ్చరించారు. విద్యుత్ భవన్ నుంచి నగరంలో వందలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు జిల్లాల డిస్కం జేఏసీ కన్వీనర్ భూక్యా నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 35 వేలు పర్మినెంట్, 26 వేల కాంట్రాక్టు కార్మికుల అనేక సమస్యలు ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. సమస్యలపై దశలవారీ ఆందోళన చేస్తున్నా న్యాయ మైన కోర్కెలను తీర్చడానికి విద్యుత్ యజమాన్యం ముందుకు రావడం లేదన్నారు. జిల్లా జేఏసీ ఛైర్మన్ ఎం.రమేశ్, జిల్లా కన్వీనర్ రాము, డిస్కం కోకన్వీనర్ తురగ రామాకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలు కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీనియర్ నాయకులు అబ్బాస్, ఏ.సంజీవ్, కే.గంగాధర్, తారసింగ్, అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆయుధ డిపో రాకతో ఉపాధి.. అభివృద్ధి సాధ్యం

» ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం



బుట్టాయగూడెం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలోకి ఆయుధ డిపో రావడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడడమే కాకుం డా ఏజెన్సీలో అభివృద్ధి జరుగుతుం దని గిరిజనుల్లో అవగాహన కల్పించాలని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు కూటమి నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. బుసరాజుపల్లి క్యాంపు కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులు, కార్యకర్తలతో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డిపో ఏర్పాటుపై కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ఏర్పాటుకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కేంద్రంతో సంప్రదింపులు జరిపి గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు వచ్చేలా చూస్తున్నారన్నారు. కూటమి నాయకులు మడకం కన్నపరాజు, కాకి లక్ష్మీ, గొంది నాగేశ్వరావు, మొడియం సింగరాజు, మెట్ట బుచ్చిరాజు, జారం చాందినీ విద్యాసాగరిక, కొమరం మల్లేశ్వరావు, మొట్టుం రమణ, ఫైదా దుర్గా, ముక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలపై కొరడా

» గనుల ఆదాయం జమ కోసం కుస్తీ
» సీనరేజి వసూళ్లకు లెటర్లు
» ప్రాజెక్టులు, ఇంజనీరింగ్ శాఖలపై దృష్టి

జిల్లాలో గనుల ఆదాయం పెంపునకు ఆ శాఖ ఉన్నతాధికారులు కార్యాచరణకు దిగుతున్నారు. మొండి బకాయిలపై కొరడా ఝుళిపించేందుకు లీజులు పొందిన గత కాంట్రాక్టర్లకు నోటీసులు పంపడానికి సిద్ధమవుతున్నారు. కలెక్టర్ల సదస్సులో గనుల ఆదాయం తగ్గడంపై సీఎం చంద్రబాబు ప్రశ్నించడం, ఆపైన కలెక్టర్ వెట్రిసెల్వి గనులశాఖ అధికారులతో గనుల ఆదాయానికి ఎక్కడ గండి పడింది.. ఎవరు బకాయిదారులున్నారో తేల్చాలని ఆదేశించడంతో కదలిక వచ్చింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ఎన్ఆర్‌పేటలోని జిల్లా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం

గనుల శాఖ ఆదాయం, మొండి బకాయిలపై ఆ శాఖాధికారులు దృష్టి సారించారు. గనుల ఆదాయం పక్కదారి పట్టకుండా సమీక్షలు జరపాలని సీఎం ఆదేశాలతో గనుల శాఖ కొంత వేగంగా కింది స్థాయిలో పెండింగ్ ఫైళ్లు లేకుండా అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇటీవలే నూతనంగా గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.పాపారావు గతంలో చేసుకున్న లీజు ఒప్పందాలు, ఇతర పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై సిబ్బందితో కార్యాచరణకు దిగారు. గతంలో ఈ శాఖ పనితీరును ఎవ్వరు పెద్దగా సమీక్షించే వారు కాదు.

బకాయిదారులకు నోటీసులు జారీ..

జిల్లాలో పోలవరం ప్రాజెక్టుతో పాటు పలు ఇంజనీరింగ్‌శాఖల ద్వారా కోట్లలో ఏటా పనులు జరుగుతుంటాయి. దీనికి సీనరేజీ కింద మొత్తం పనులు చేసిన విలువలో ఒక శాతం గనులశాఖకు జమ కావాల్సి ఉంది. ఇది సక్రమంగా జమ కావడం లేదని గుర్తించారు. ప్రధానంగా (మిగతా 8వ పేజీలో)

ఆర్డీవో కార్యాలయం వద్ద రైతుల ధర్నా

జంగారెడ్డిగూడెం,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువ జలాశయం భూముల్లో అక్రమ సాగుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఆర్డీవో ఎంవి.రమణకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం రైతు, ఎ.పోలవరం మాజీ సర్పంచ్ బుద్దాల సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ సన్న,చిన్నకారు రైతులు ఎర్ర కాలువ జలాశయం నిర్మాణానికి అతి తక్కువ ధరకే భూములు ఇచ్చారన్నారు. ఒక పంట మునుగుతుందని, రెండవ పంటకు తమ భూములను దున్నకుండా సర్వే తోటలు, కొబ్బరి,పామాయిల్ తోటలు వేసుకుంటే ఆదాయం వస్తుందని అప్పటి ఉమ్మడి జిల్లా జేసీ జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో రైతుల సమావేశంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే ఇటీవల కొందరు కమ్యూనిస్టు నాయకులమని చెప్పి ప్రాజెక్టు భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి, భూములు ఇచ్చిన రైతులను భయపెట్టి సాగుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అడ్డుపడిన రైతులపై కేసులు పెడతామని బెదిరిస్తున్నట్టు తెలిపారు. కాగా డీఎస్పీతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఆర్డీవో హామీ ఇచ్చినట్టు సత్యనారాయణ తెలిపారు. ఇరిగేషన్ కార్యాలయంలో ఇరిగేషన్ డీఈ సునీతను రైతులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. జంగారెడ్డిగూడెం మండలం చిన్నవారిగూడెం, ఎ.పోలవరం, మధ్యాహ్నపువారి గూడెం, టి.నరసాపురం మండలానికి చెందిన రైతులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు


జంగారెడ్డిగూడెం నూకాలమ్మ



పెనుగొండలో బాలాత్రిపురసుందరిగా వాసవీ మాత, నగరేశ్వర మహిషాసుర మర్దని




ఏలూరు 12 పంపుల సెంటర్, దక్షిణపు వీధి ఆలయం, అగ్రహారం ఆలయాల్లో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు


ఆచంటలో పార్వతి అమ్మవారు


తాడేపల్లిగూడెం బలుసులమ్మ

బాలా త్రిపుర సుందరి దర్శనం

ఉమ్మడి జిల్లాలో శరన్నవ రాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భీమవరం మావుళ్లమ్మ, గునుపూడి సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆచంట రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతి దేవి బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. జంగారెడ్డిగూడెంలో నూకాలమ్మ స్వర్ణ కవచాలంకృత నూకాంబికా దేవిగా భక్తుల పూజలు అందుకున్నారు. ఏలూరులోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనార్థం ఆలయాలకు తరలి వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఏలూరులో అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తు రద్దీ


ఏలూరులో అమ్మవారి ఆలయంలో హారతి అందుకుంటున్న భక్తులు

చిన వెంకన్న ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు
రూ.10 లక్షల విరాళం


చెక్ అందజేస్తున్న దాత శేషగిరిరావు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దాత రూ.10లక్షలు విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన తాడికొండ శేషగిరిరావు సోమవారం కుటుంబసమేతంగా ఆలయానికి వచ్చి ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తికి విరాళం చెక్కును అందజేశారు. దాతకు ఈవో మూర్తి శ్రీవారి దుశ్శాలువాను కప్పి ప్రసాదాలను అందించి సత్కరించారు.


సత్యనారాయణను అభినందిస్తున్న చీడే సత్యనారాయణ

నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు మెంబర్‌గా
సీఎస్ఎన్ ప్రిన్సిపాల్ ఎంపిక

భీమవరం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్పోర్ట్స్ మెంబర్‌గా సీఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సకుమళ్ళ సత్యనారాయణను ఎంపికయ్యారు. ఆయన నియామకం అభినందనీయమని సీఎస్ఎన్ విద్యా సంస్థల సెక్రటరీ చీడే సత్యనారాయణ అన్నారు. కళాశాలలో సత్యనారాయణకు సోమవారం అభినందన సభ నిర్వహించారు. చీడే సత్యనారాయణ మాట్లాడుతూ 400 కళాశాలల్లో మన కళాశాల ప్రిన్సిపాల్‌కు మెంబర్ రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ముఖాలు, ఒకే మెదడు..
యడ్లగూడెంలో వింత మేక జననం



పోలవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం పంచాయతీ యడ్లగూడెంలో వింత మేక జననం చర్చనీయాంశమైంది. కట్టూరి రామారావుకు చెందిన మేక శనివారం రాత్రి రెండు ముఖాలు ఒకే మెదడుతో ఉన్న వింత మేకపిల్లకు జన్మనిచ్చింది. రెండు ముఖాలు ఒకే మెదడుతో ఉంది. 2 నాలుకలతో 2 కళ్లతో వింత మేకపిల్ల జననం గ్రామంలో దావానలంలా వ్యాపించింది. పలువురు మేక పిల్లను చూడడానికి ఎగబడ్డారు. దీనిపై పశువైద్య సంచాలకుడిని వివరణ కోరగా జన్యులోపంతో ఇలా పుట్టిందని, ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం మేకపిల్ల ఆరోగ్యంగా ఉందని మేకల కాపరి రామారావు తెలిపారు.

అధ్యక్షా..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు
పండుగ సెలవుల్లో తేడాలు ఉండొద్దు



వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

తణుకు రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు పండుగలకు సంబందించి ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇవ్వాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ శాసనమండలి దృష్టికి తీసుకువచ్చారు. శాసన మండలి సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడుతూ పండుగల వేళల్లో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల మధ్య వ్యత్యాసంతో విద్యార్థులలో న్యూనతాభావం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు పండుగ సెలవులు ఒకేవిధంగా వుండేలా చూడాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూనిఫాం పేరుతో ఒకే రంగు పాలిస్టర్ గుడ్డలను విద్యార్థులు వాడుతున్నారని దీనివలన దీర్ఘకాలంలో విద్యార్డులు చర్మవాదులకు గురవుతారని సభ దృష్టికి తీసుకొచ్చారు.

టిడ్కో ఇళ్ల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలి



బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 2014 అధికారంలోకి వచ్చిన తరువాత నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించడంలో తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం లక్ష్యం నిర్లక్ష్యం చేసింది. పేద ప్రజలు అద్దె ఇళ్లలోనే ఉంటున్నారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసంబ్లీలో ప్రస్తావించారు. లబ్ధిదారులు కట్టిన లక్ష రూపాయలు ఏమయ్యాయో అనే ఆందోళనలో ఉన్నారని, వారికి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఫ్లాట్స్ పొందిన వారికి స్థలాలు కేటాయింపు అంశం మరోక గందరగోళంగా ఉందని ఈ అంశాలపై స్పష్టత ఇవ్వాలన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- వచ్చేనెల 2 నుంచి 9 వరకు ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలు
- 6న స్వామి వారి కల్యాణం
- 7న రథోత్సవం


ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి క్షేత్రం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే నెల 2 నుంచి 9 వరకూ వైఖానస ఆగమయుక్తంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో ఎన్వీ ఎస్ఎన్ మూర్తి తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆయన వివరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 2న ఉదయం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారు. 3న ధ్వజారోహణ, 5న రాత్రి 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 6న రాత్రి 8గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. 7న రాత్రి 8గంటలకు రథోత్సవం, 8న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ జరుగుందన్నారు. 9న ఉదయం 9గం.లకు చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశకోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని భక్తులు గమనించాలని ఆయన కోరారు.

నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు

శ్రీవారి దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వచ్చేనెల 2 నుండి 9 వరకూ నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



వాహనసేవలు ఇలా

- 2న రాత్రి 7గంటలకు గజవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ.
- 3న రాత్రి 9గంటలకు ధ్వజారోహణ అనంతరం హంస వాహనంపై తిరువీధిసేవ.
- 4న ఉదయం7గం.లకు సూర్యప్రభ, రాత్రి 7గంటలకు చంద్రప్రభపై గ్రామోత్సవం.
- 5న ఉదయం 7గంటలకు హనుమద్వాహనంపై తిరువీధిసేవ.
- 6న రాత్రి 8గంటలకు శ్రీవారి కల్యాణం అనంతరం వెండి గరుడ వాహనాలపై తిరువీధి సేవలు.
- 7న రాత్రి 8గంటలకు రథవాహనంపై శ్రీవారి తిరువీధిసేవ.
- 8న రాత్రి 9 గంటల అనంతరం అశ్వ వాహన సేవ.
- ప్రతీరోజూ ఉదయం 8.30 నుంచి రాత్రి 9గంటల వరకూ వేదపారాయణలు, సాంస్కృతిక కార్యక్రమాలు.

వంతెన నిర్మాణం వదిలేశారు..!


తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో రహదారి దుస్థితి

జాతీయ రహదారిపై తణుకు వద్ద నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఉండ్రాజవరం జంక్షన్, తేతలి వై జంక్షన్ వద్ద పనులు మధ్యలో ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉండ్రాజవరం జంక్షన్‌లో సర్వీసు రోడ్డు అధ్వానం కావడంతో కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా ఉంది. ఇరుకు మార్గంలో భారీ వాహనాల రాకపోకలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఉండ్రాజవరం జంక్షన్, తేతలి వై జంక్షన్‌లో నిలిచిపోయిన ఫ్లై ఓవర్ నిర్మాణం
- మూడేళ్లుగా ముందుకు సాగని పనులు
- సర్వీసు రోడ్లు అధ్వానం
- గోతులతో ఇప్పటివరకు ఐదుగురి మృతి
- నిత్యం అనేక మందికి గాయాలు

తణుకు రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణ కోసం నిర్మిస్తున్న ఫ్లైవోర్ బ్రిడ్జి (వంతెన) పనులు ప్రమాదకరంగా మారాయి. మూడేళ్ల క్రితం చేపట్టిన పనులు నిలిచిపోవడంతో వేలాది వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ మార్గంలో నరకం చూస్తున్నారు. సుమారు కిలో మీటరు మేర రోడ్డులో వంతెనకు ఇరువైపులా సర్వీసు రోడ్లు గోతులు పడి వర్షం నీటితో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతులలో పడి సుమారు ఐదుగురు మృతి చెందడంతో పాటు నిత్యం అనేక మంది గాయాల పాలవుతున్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు పెరుగుతున్నా నిర్మాణ సంస్థలు మాత్రం పనులను పట్టించుకోవడం లేదు.

కోల్‌కతా- చెన్నై జాతీయ రహదారిపై నిత్యం భారీ వాహనాలతో పాటు వేలాది ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు సాగుతాయి. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు చోట్ల ట్రాఫిక్ రద్దీగా వుండే పలు ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి అక్కడ ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్లకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 2022లో అప్పటి కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారి శంకుస్థాపన చేశారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి జంక్షన్, తణుకు ఉండ్రాజవరం జంక్షన్‌లో వంతెనల నిర్మాణానికి ఒకేసారి శంకుస్థాపన చేసి పనులు చేపట్టారు. మోరంపూడి జంక్షన్‌లో వంతెన గత ఏడాది ఆగస్టులో ప్రారంభించారు. ఇక్కడ మాత్రం ఇప్పటికీ నిర్మానం పూర్తి కాలేదు. అప్పట్లోనే ఇక్కడ నాయకులు శ్రద్ధ వహిస్తే అందుబాటులోకి వచ్చేదని పలువురు అంటున్నారు. ఇక్కడ నిర్మాణ పనులు నిలిచిపోవడంలో వంతెనకు ఇరవైపులా రోడ్లు గోతులు పడి ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. ఈ మార్గంలో నిత్యం రావులపాలెం, పెరవలి, తాడేపల్లిగూడెం, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది వాహనాలతో ప్రయాణాలు సాగిస్తారు. వీటితో పాటు వివిధ ప్రైవేట్ పాఠశాలల బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహాలపై రాకపోకలు సాగిస్తారు. ఈ వంతెన వద్ద రోడ్లు పూర్తిగా ధ్వంసమై పాటు గోతులు పడి రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేదని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం వంతెన పక్కన రోడ్లనైనా నిర్మిస్తే ప్రయాణాలకు వీలుగా వుంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.

తేతలి వై జంక్షన్‌లో పిల్లర్లతో సరి

తణుకు తేతలి వైజంక్షన్ వద్ద వంతెన నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. రహదారి మధ్యలో అసంపూర్తి పిల్లర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మరోవైపు పిల్లర్ల పక్కన సర్వీసు రోడ్లు గోతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణం ఎలా వున్న కనీసం రోడ్డుపై గోతులనైనా పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కేంద్ర మంత్రి హామీ నెరవేరేదెప్పుడు?

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల జాతీయ రహదారిలోని పలు బ్లాక్ స్పాట్‌ల వద్ద చేపట్టిన ఫ్లైఓవర్ల నిర్మాణాలు 2025 ఏప్రిల్ నాటికి అందుబాటులోకి వస్తాయని కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరీ గతంలో ప్రకటించారు. ఇప్పకిటీ పనులు పూర్తి కాలేదు. స్థానిక ఎంపీ కేంద్ర మంత్రిగా ఉన్నా వంతెన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు చర్చించుకుంటున్నారు. పనులు నిలిచిపోవడంతో వివరాల కోసం జాతీయ రహదారుల నిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన లేదు.

అసెంబ్లీలో ప్రస్తావించినా..



జాతీయ రహదారిపై వంతెన నిర్మాణంలో అలసత్వం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రస్తావించారు. అయినా ప్రభుత్వం స్పందించ లేదు. చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. సర్వీసు రోడ్డు కూడా ధ్వంసం కావడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

- కడలి రామారావు, పీసీసీ సభ్యుడు, తణుకు

భీమడోలులో ఆర్వోబీ

- రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్
- నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం
- ద్వారకాతిరుమల, రాజమండ్రి మార్గంలో ట్రాఫిక్ సమస్యకు మోక్షం

భీమడోలు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భీమడోలులో ప్రధానమైన ట్రాఫిక్ సమస్యకు మోక్షం కలగనుంది. ద్వారకాతిరుమల భక్తులు, రాజమండ్రి, కొవ్వూరు ప్రయాణికుల సమస్యకు తెరపడనుంది. భీమడోలు రైల్వేగేటు సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ దిశగా అధికారులు బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కేంద్ర రైల్వేశాఖ రైల్వే క్రాసింగ్ గేట్లను మూసివేస్తున్న నేపథ్యంలో ఇప్పటికే భీమడోలు మండల పరిధిలోని కురెళ్లగూడెం, పాతూరు రైల్వే గేట్లను శాశ్వతంగా మూసివేసి అండర్ పాస్ నిర్మాణాలు పూర్తి చేశారు. వాహన రాకపోకలు అధికంగా ఉండే భీమడోలు రైల్వే గేటు కూడా శాశ్వతంగా మూసివేసే క్రమంలో ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తెరపైకి వచ్చింది. ఎట్టకేలకు బ్రిడ్జి మంజూరుకు లైన్ క్లియర్ కావడంతో సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు

నిత్యం నిలిచిపోతున్న ట్రాఫిక్

నిత్యం వందలాది వాహనాలు గేటుకిరువైపులా నిలిచిపోతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి మంజూరుతో ట్రాఫిక్ సమస్యకు మోక్ష కలిగినట్లయింది. తొలుత రైల్వేగేటు పైనుంచి బ్రిడ్జి నిర్మాణం చేస్తారన్న ఊహాగానాలకు తెరపడింది. పక్కనే ఉన్న జాతీయ రహదారి, ఏలూరు కాలువ ఇబ్బందులతో పాటు గేటు కిరువైపులా ఇళ్లను ఖాళీ చేయించాల్సి ఉంటుంది. రైల్వేగేటుకు కొంత మేర దూరంలో ఆర్వోబీ నిర్మించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపారు.


భీమడోలు రైల్వే గేటు ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ



శరీర సౌష్టవ పోటీల్లో అభ్యర్థులు

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందుకున్న విజేతలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్, ఫిజిక్ మోడలింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎస్.రాజు, కార్యదర్శి నిర్వాహకులు షేక్ ఖాసిం మాట్లాడుతూ 8 విభాగాలుగా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాడీ బిల్డింగ్ విభాగంలో మిస్టర్ ఆంధ్రగా ఛాంపియన్‌గా నిలిచిన పి.విక్రమ్‌కుమార్ (విశాఖపట్నం)కు ట్రోఫీతోపాటు మోటార్ బైక్‌ను, ఫిజిక్ మోడలింగ్ విభాగంలో మిస్టర్ ఆంధ్ర స్థానం సాధించిన జె.వరుణ్‌కుమార్ (విజయనగరం)కు ట్రోఫీతోపాటు బైక్, ఆడియన్స్‌లో లక్కీడిప్ విజేత యశ్వంత్(విజయనగరం)కు మోటార్‌బైక్‌ను అందజేశారు. వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందించామని తెలిపారు. న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఛైర్మన్ దాసి వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బందారు వినోద్, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఛాంబర్ అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు, బుద్ధరాజు వెంకటపతిరాజు, చింతలపాటి రామకృష్ణరాజు, అల్లు శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మాస్టర్ కోచ్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా కోడె రాజు, షేక్ ఖాజీ, ఆర్‌కె.కుబేంద్ర, రిచి పర్యవేక్షించారు.

ఓట్ల చోరీపై కాంగ్రెస్ సంతకాల సేకరణ



ఏలూరులో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అవ కాశవాద రాజకీయాలకు పాల్పడు తోందని, ఓట్ల చోరీకి నిరసనగా సంతకాల సేకరణ చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయం నుంచి వసంతమహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజల నుంచి సంతకాల సేకరించారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చేనెల 15 వరకు సంతకాల సేకరిస్తామన్నారు. లక్ష సంతకాలు సేకరించి అధిష్ఠానానికి పంపిస్తామన్నారు. ఉన్నమట్ల ఎలీజా, బొద్దు నోబెల్, మరీదు కృష్ణ, ఆలపాటి నరసింహమూర్తి, పెద్దిరెడ్డి సుబ్బారావు, గౌతు సత్యేంద్ర, ఎం.బుచ్చిరాజు, కట్టా నాగరాజుగౌడ్, బి.వెంకటరమణ, లంకా రామ్మోహన్, గౌడ రంగబాబు, వై.నాగేంద్ర, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.

తణుకులో సంతకాల సేకరణ



తణుకులో సంతకాలు సేకరిస్తున్న నేతలు

తణుకు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీకి వ్యతిరేకంగా సోమవారం నరేంద్ర సెంటర్‌లో పలువురు నేతలు సంతకాల సేకరణ చేపట్టారు. దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోదీ వెంటనే పదవి నుంచి వైదొలగాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దిర్శిపో రామకృష్ణ, దారిదీపం సంపాదకులు డీవీవీఎస్ వర్మ, సంకు మనోరమ, పేరూరి మురళీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రసరాజుకు సత్కారం



గుంటూరు మహాకవి జాషువా పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న జాషువా 130 వారోత్సవాల సందర్భంగా సోమవారం తణుకుకు చెందిన ప్రముఖ కవి రసరాజును మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు సత్కరించారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్లను నియమించాలి

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):నగరపాలక సంస్థ యాజమాన్యంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలకు క్లస్టర్లలో మిగులు(సర్‌ప్లస్)గావున్న టీచర్లను నియమించి బోధనకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘ నేతలు కోరుతున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు నేతృత్వంలో సంఘ నాయకులు సోమవారం డీఈవో వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రాన్ని అందజేసింది. పాఠశాలలకు పంపిణీచేయాల్సిన సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను జిల్లాలోని కొందరు ఎంఈవోలు మండల కేంద్రానికి వచ్చి తీసుకెళ్లాలని ప్రధానోపాధ్యాయులకు చెబుతుండడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారం స్కూల్స్‌కు పుస్తకాలను చేర్చాల్సిన బాధ్యత ఎంఈవోలపై ఉన్నందున ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు సీపీసీఆర్ఐ మాజీ డైరెక్టర్ పర్యటన

పెదవేగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):సీపీసీఆర్ఐ మాజీ డైరెక్టర్ చౌడప్ప మంగళవారం పెదవేగి మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు వంగూరులో కొబ్బరి, అంతర పంట కోకో సాగు పరిశీలిస్తారు. 10 గంటలకు పెదవేగిలోని ఆయిల్‌పామ్, అంతర పంట కోకోను పరిశీలించి, దిగుబడులపై రైతుల అభిప్రాయాలను, కష్టనష్టాలను తెలుసుకుంటారని పెదవేగి మండల ఉద్యానశాఖాధికారి ఎం.రత్నమాల తెలిపారు.

ప్రైవేటు బ్లడ్ బ్యాంకుపై తలసీమియా బాధితుల ఫిర్యాదు

భీమవరం టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):తమకు సాయం చేస్తున్న హోప్ ఛారిటబుల్ ట్రస్టుపై దుష్ప్రచారంతో సాయాన్ని అడ్డుకుంటున్నారని తలసేమియా బాధితులు, తల్లిదండ్రులు సోమవారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. హోప్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ప్రతి నెలా 40 మంది తలసీమియా బాధితులకు రక్తం అందిస్తున్నారని తెలిపారు. భీమవరంలోని ఒక ప్రైవేటు బ్లడ్ బ్యాంకు.. వారిపై దుష్ప్రచారం చేయడంతో బాధితులకు రక్తం అందే పరిస్థితి లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుష్ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకుని తమకు అన్యాయం జరగకుండా చెయ్యాలని వారు కోరారు కలెక్టర్ కార్యాలయం వద్ద పిల్లలతో తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

శభాష్.. మా..స్టార్

నిరుపేద అభ్యర్థులకు ఎమ్మెల్యే చింతమనేని ఉచిత డీఎస్సీ కోచింగ్

- రూ.60 లక్షలతో నాలుగు నెలలపాటు 500 మందికి శిక్షణ.. ఉచిత స్టడీ మెటీరియల్.. భోజన సదుపాయం
- 38 మందికి టీచర్లుగా ఉద్యోగం
- చాలా గర్వంగా వుందన్న ప్రభాకర్

పెదవేగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఏడాదికో జాబ్ కాలెండర్ హామీతో గద్దెనెక్కిన వైఎస్ జగన్ ఇచ్చిన హామీని గాలికొదిలేయడంతో ఐదేళ్లపాటు నిరుద్యోగ యువత నిరాశకు గురైంది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే పెట్టడంతో నిరుద్యోగ యువత ఎన్నో ఆశలతో డీఎస్సీకి సిద్ధమైంది. అయితే డీఎస్సీ శిక్షణకు వేలల్లో ఖర్చు అవుతుందని, తన నియోజకవర్గంలో పేదరికంతో శిక్షణ తీసుకోలేని వారు ఎవరూ ఉండకూడదని నిర్ణయించారు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. ఈ ఆలోచనతో ఏలూరు పీడీబీటీ కళాశాల ఆడిటోరియంను కోచింగ్ సెంటర్‌గా మార్చేశారు. నాలుగు నెలలపాటు 500 మందికి ఉచిత శిక్షణ ఇప్పించారు. వారికి కావాల్సిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందించారు. భోజన సదుపాయం కల్పించారు. సబ్జెక్టు నిపుణులను రప్పించారు. అంతటితో వదిలేయకుండా కోచింగ్ తీరుతెన్నులను నిరంతరం పర్యవేక్షించారు. ఇందుకు సుమారు రూ.60 లక్షలు వెచ్చించారు. దీని ఫలితమే 38 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారు. వారంతా దసరా సెలవుల అనంతరం విధుల్లో చేరడానికి ఆనందంతో ఎదురు చూస్తున్నారు.



డీఎస్సీ అభ్యర్థికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని (ఫైల్)

మరిన్ని తరగతులు ఏర్పాటు చేస్తా

ప్రతిభ ఉండి కూడా సరైన మార్గ నిర్దేశం లేక యువత నిరాశా, నిస్పృహలతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. మంచి శిక్షణ ఇస్తే అలాంటి వారు ఉద్యోగాలు సాధిస్తారు. అందుకే ఉచిత డీఎస్సీ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశా. దెందులూరు, ఏలూరు నియోజకవర్గాలతోపాటు జిల్లావ్యాప్తంగా సుమారు 500 మంది యువత శిక్షణ తీసుకోవడానికి వచ్చారు. వీరిలో 38 మంది మెరుగైన ప్రతిభను చూపించి విజయం సాధించారు. ఉద్యోగాలు పొందడం నాకు చాలా ఆనందంగా, గర్వంగా ఉంది. రాబోయే ఉద్యోగ నియామక ప్రక్రియలకు సైతం యువతకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి, వారికి అండగా నిలుస్తా.

- చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎమ్మెల్యే

ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి, తమ బిడ్డలను చదివించామని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఉచిత శిక్షణతో తమ కుటుంబాల్లో ఎమ్మెల్యే ప్రభాకర్ వెలుగులు నింపారని అభ్యర్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణకు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

జీవితాంతం గుర్తుంచుకుంటాం



డీఎస్సీ అనగానే ఎక్కడో అవనిగడ్డలాంటి చోట్ల మెరుగైన శిక్షణ ఇస్తారని విన్నాం. కానీ ఏలూరు లోనే అంతకుమించిన శిక్షణ ఇవ్వడం మాలాంటి వారికి ఎంతో మేలు చేసింది. ఎలాంటి రుసుం తీసుకోకుండా పూర్తి ఉచితంగా శిక్షణ ఇచ్చారు. తొలుత 100 రోజులన్నారు. పాఠ్యాంశాలు పూర్తి కాకపోవడంతో మరో 20 రోజులు కలిపి 120 రోజులు ఇచ్చారు. స్టడీ మెటీరియల్‌తోపాటు భోజన వసతి కల్పించడం చింతమనేని గారికే చెల్లుతుంది. నేను ఈ శిక్షణ వల్లే టీచర్‌గా ఎంపికయ్యా. ఆయనను జీవితాంతం గుర్తుంచుకుంటా.

- భలే నీరజ, సత్రంపాడు, ఏలూరు

ఉద్యోగంపై ఆశ వదులుకున్నా..



డీఎస్సీ ప్రకటన వచ్చేసరికి నేను బాలింతను. నెల రోజుల పసికందుతో కోచింగ్‌కు వెళ్లడం అసాధ్యమని ఉద్యోగంపై ఆశలు వదులుకున్నా. ఆ సమయంలో ఎమ్మెల్యే ప్రభాకర్ గారు మా ఇంటి సమీపంలోనే ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారనే సమాచారంతో నాలో ఆశలు చిగురించాయి. ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉండే మాకు రూపాయి ఖర్చు లేకుండా శిక్షణ ఇస్తామని చెప్పడంతో ఆనందం వేసింది. చివరకు ప్రభాకర్ గారు ఇప్పించిన శిక్షణతోనే ఉద్యోగం సాధించా. ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు.

- బుడిమూరి కుసుమ మణిదుర్గ, ఏలూరు

డీఎస్సీ ఉపాధ్యాయ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ-2025కి ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నెల 25న మధ్యాహ్నం ఒంటి గంటకు అమరావతిలో నియామక పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా అభ్యర్థులందరూ ఈ నెల 24వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఏలూరులో ఏర్పాటు చేసిన 10 వేదికల వద్దకు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. సంబంధిత వేదికల నుంచి 25న ఉదయం 8 గంటలకు బస్సుల్లో అమరావతిలో నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి చేర్చేందుకు అభ్యర్థులను తీసుకువెళ్తామన్నారు. ఏలూరులో 24న సాయంత్రం 4 గంటలకు రిపోర్టు చేయడానికి వచ్చే అభ్యర్థులు తమ వెంట రాత్రి బసకు అవసరమైన వ్యక్తిగత మెడికల్ సామగ్రి, గుర్తింపు కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, బెడ్ షీట్, దిండు, నీళ్ల బాటిల్, గొడుగు, రెయిన్ కోటు, అభ్యర్థి వెంట సహాయకునిగా వచ్చే వ్యక్తి గుర్తింపు కార్డు, ఫోటో, ఇతర అవసరమైన వస్తువులు తెచ్చుకోవాలని కోరారు. నియామక పత్రాలు అందజేత కార్యక్రమం నుంచి గర్భిణులు, పాలిచ్చే తల్లులకు, అనారోగ్య కారణంగా ఆసుపత్రుల్లో చేరిన వారికి ముందస్తు అనుమతిపై మినహాయింపు ఉంటుందని వివరించారు. ఈ మూడు కారణాలతో ఉపాధ్యాయ అభ్యర్థులెవరైనా ఉంటే వెంటనే ఏలూరు డీఈవో కార్యాలయానికి తెలియజేయాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలి

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులను మేజర్‌గా ఎంచుకున్న విద్యార్థులకు బోధించడానికి వీలుగా అధ్యాపకులను నియమించాలని అభ్యర్థిస్తూ సోమవారం అమరావతిలో ఉన్నత విద్యాశాఖ కమిషనర్ భరత్‌గుప్తాకు వినతిపత్రాన్ని అందజేసినట్టు ఎస్ఎఫ్ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును అభ్యసించడానికి 20 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు తీసుకున్నారని తెలియజేశామన్నారు. కళాశాలలో బోధనా తీరు, ఫర్నీచర్, తరగతి గదుల కొరత వల్ల కొత్త కోర్సులకు అడ్మిషన్లను నిలిపి వేయడం, తదితర సమస్యలపై కమిషనర్‌కు వివరించామన్నారు. డిగ్రీ కళాశాలకు తరగతి గదులు నిర్మిస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కమిషనర్‌ను కలిసిన ఎస్ఎఫ్ఐ నాయకుల్లో శివాజీ, జయంత్, వంశీకృష్ణ, రాజేశ్ ఉన్నారు.

పోలీసు నుంచి టీచర్లుగా

- నలుగురు కానిస్టేబుళ్లను సత్కరించిన ఏలూరు ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి):అంకిత భావంతో పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాపశివకిశోర్ సూచించారు. పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న యు.శ్రీనివాసరావు(పీసీ 1478), ఎం.సుబ్రహ్మణ్యం(2435), ఎస్.వనజారాణి (డబ్ల్యుపీసీ 976), పి.అఖిల శ్రావణి (డబ్ల్యుపీసీ 4274) ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారు. వీరిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సత్కరించి బహుమతులు అందించారు. ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టం వస్తే అధైర్య పడవద్దు

ప్రతి ఒక్కరికి కష్టసుఖాలు ఉంటాయని కష్టం వచ్చింది కదాని ఆత్మహత్య చేసుకుంటే వారి బంగారు భవిష్యత్తు, వారిపై ఆధారపడిన వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని ఎస్పీ కిశోర్ అన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ ఈ ఏడాది మే 23న ఏలూరు ఎస్ఆర్ పేట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా స్థానికులు డయల్ 112కు సమాచారం అందించడంతో శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది ఆమెను కాపాడారు. తర్వాత ఆమె పట్టుదలతో చదివి డీఎస్సీలో ఉద్యోగం పొందడంతో ఆమెను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు.

మహిళ కృతజ్ఞతలు

జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న తనను శక్తి టీం కాపాడి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పట్టుదలతో చదివి డీఎస్సీలో ఉద్యోగం పొందానని తన ఉన్నతికి దోహదపడిన శక్తి దళ సభ్యులకు, జిల్లా పోలీసు అధికారులకు జీవిత కాలం రుణపడి ఉంటానని ఆ మహిళ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. శక్తి టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు, మహిళా ఎస్ఐ నాగమణి, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులుగా ఎంపికైన కానిస్టేబుళ్ళను సన్మానించిన ఎస్పీ కిశోర్

ఐటీఐ ఉత్తీర్ణులకు ధ్రువపత్రాలు

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో వివిధ ట్రేడ్‌లలో 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తీర్ణత సర్టిఫికెట్లను అందజేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ భూషణం మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ల ఆవిష్కరణ

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరు వెంకటేశ్వర జ్ఞాన మందిరంలో నిర్వహించ తలపెట్టిన రణభేరి భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి అధికసంఖ్యలో టీచర్లు తరలిరావాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో రణభేరి వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సుభాషిణి, వెంకటేశ్వరరావు, శివశంకర్ పాల్గొన్నారు.



తమ్మిలేరులో గాలిస్తున్న పోలీసులు.. చనిపోయిన ప్రకాశ్(ఫైల్)

తమ్మిలేరులో పడి గేదెల కాపరి మృతి

పెదవేగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బి.సింగవరానికి చెందిన పశువుల కాపరి తమ్మిలేరులో పడి మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. గుడ్డేటి ప్రకాశ్‌కు భార్య సుధారాణి, 8, 10 తరగతులు చదువుతున్న మౌనిక, మోషిత అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించే ప్రకాశ్ ఆదివారం తమ్మిలేరులోకి దిగిన గేదెలను బయటకు తోలే క్రమంలో ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో గాలింపు చేపట్టారు. చీకటి పడడంతో గాలింపునకు అంతరాయం ఏర్పడడంతో నిలిపివేసి, సోమవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నానికి ప్రకాశ్(40) మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, శవపరీక్ష నిర్వహించారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమార్తె(14) తిరిగి రాలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ పరిధిలోని ఒక పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ కానరాలేదు. తండ్రి సోమవారం రాత్రి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొలుసు చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

అత్తిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):అత్తిలి తదితర ప్రాంతాలలో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు తణుకు రూరల్ సీఐ బి.కృష్ణమోహన్, అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. అత్తిలి పోలీస్ స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన అనుబోయిన నాని బాబు, పనసపాడుకు చెందిన బొమ్మ రాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులు చోరీ చేసి ఎత్తుకెళ్లడం వీరి నైజమన్నారు. తుని, అన్నవరం, రాజోలు, రావులపాలెం, అత్తిలి, ఇరగవరం, తణుకు తదితర ప్రాంతాలలో 11చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోతుండగా మంచిలి గ్రామం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 223 గ్రాముల బంగారం, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను తణుకు కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ కేసులో కానిస్టేబుల్ ఎస్.కె.అన్వర్, మలక శ్రీనివాస్, వై శివకృష్ణ సహకరించినట్లు వారు తెలిపారు.

డిజిటల్ అరెస్టు అనేదే లేదు

ఫేక్ కాల్స్‌కు స్పందించవద్దన్న ఎస్పీ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు అనేది చట్ట ప్రకారం ఎక్కడా లేదని ఎవరైనా వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటే నమ్మవద్దని సైబర్ నేరగాళ్లు ఇలాంటి కాల్స్ చేసి బెదిరించి డబ్బులను కాజేస్తున్నారని ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ సూచించారు. జిల్లాలోని ప్రజలు ఇటీవల సైబర్ నేరాలకు గురవుతున్నారని ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకోవాలన్నారు. నేరగాళ్లు తాము పోలీసులమని, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులమని ఇతర సంస్థల చట్టాల అమలు సంస్థల అధికారులమని వీడియో కాల్స్ చేసి బెదిరిస్తారన్నారు. వారు బెదిరించి డిజిటల్ అరెస్టు చేస్తున్నామని మళ్ళీ అంతేకాకుండా అరెస్టు ఆర్డర్ జారీ చేసినట్లుగా నకిలీ ఆర్డర్లు కూడా వాట్సప్‌లో పెడతారని ఇంటర్నెట్ ద్వారా అరెస్టు చేశామని చెప్తారని ఈ విధంగా భయపెట్టి వారి అకౌంట్లకు డబ్బులను బదిలీ చేయించుకుంటారన్నారు. పోలీసులు లేదా ఏ చట్టాలు అమలు సంస్థ అధికారులు కూడా ఇంటర్‌నెట్ అరెస్టు చేయరని, వీడియోకాల్స్ సోషల్ మీడియా అరెస్టు జరగదని ఎవరికైనా కేసులు ఉంటే అది అధికారిక పద్ధతిలో మాత్రమే జరుగుతాయని సూచించారు. వీడియో కాల్స్, చాటింగ్స్ వస్తే తక్షణమే వాటిని కట్ చేయాలని ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు పంపవద్దని, ఈ తరహా కాల్స్ వస్తే వెంటనే 112కు కాల్ చేయాలని దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఇలాంటి వాటిపై తాము అవగాహన పొందడమే కాకుండా చుట్టు పక్కల వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం www.cybercrime.gov.in పోర్టల్‌ను ఉపయోగించాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

ఇంటి నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు
గంటల వ్యవధిలో పట్టుకున్న పోలీసులు

ముదినేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి పారిపోయిన ముగ్గురు బాలికల ఆచూకీని గంటల వ్యవధిలోనే కనిపెట్టి ముదినేపల్లి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. గురజలో ఓ మహిళ తమ ఇంట్లో బీరువాలో డ్వాక్రా గ్రూపు సొమ్ము రూ. 9 వేలు దాచి ఉంచింది. దీనిని చూసిన ఆమె కుమార్తె, పక్కనే ఉంటున్న ఆమె అక్క ఇద్దరు కుమార్తెలు కలిసి రూ.4 వేలు తీశారు. వారు సొమ్ము తీశారని తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించడంతో ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు ఎవరికి చెప్పకుండా గురజ నుంచి వెళ్లిపోయారు. తమ కుమార్తెల అదృశ్యంపై ఇద్దరు మహిళలు ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ల పవన్, నాగబాబు వారి కోసం వెతుకుతూ విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఆదివారం రాత్రి వెళ్లారు. తిరుపతి వెళ్ళే రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫారమ్‌పై సిద్ధంగా వున్న ఆ బాలికలు కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు కానిస్టేబుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురు బాలికలను క్షేమంగా తీసుకువచ్చి వారి తల్లి దండ్రులకు అప్పగించినందుకు ఎస్ఐ వీరభద్రరావు, కానిస్టేబుళ్ళు పవన్, నాగబాబులను ఎస్పీ కిశోర్ సోమవారం అభినందించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ముదినేపల్లి కానిస్టేబుళ్లను అభినందిస్తూ వారు చూపిన చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధికి వైద్య ఖర్చులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ముదినేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి వైద్య ఖర్చులను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ముదినేపల్లి మండలం కోడూరుకు చెందిన ఉచ్చుల రాయప్ప(56) ఆరేళ్ల క్రితం కుటుంబంతో సహా విజయవాడ వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి భార్యా పిల్లలు వున్న కొద్దిపాటి సొమ్ము ఖర్చు పెడుతుండడంతో రాయప్ప మనోవేదనకు గురై ఈ నెల 21న కోడూరు వచ్చి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు ఆయనను గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

అక్కను వేధిస్తున్నాడని.. మేనల్లుడి హత్య

కత్తితో పొడవడంతో చికిత్స పొందుతూ మృతి - పెంటపాడులో ఘటన



కేతన్‌బాబు(ఫైల్)

పెంటపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):తన అక్కను వేధిస్తున్నాడన్న కోపంతో మేనల్లుడిని మేనమామే పొడిచి చంపిన ఘటన పెంటపాడులో జరిగింది. పెంటపాడుకు చెందిన ముప్పిడి కేతన్‌బాబు(38) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తల్లి షారా బాయితో గొడవపడ్డాడు. షారా బాయి తన తమ్ముడు తానేటి గిరిబాబు అలియాస్ జాన్‌బాబు పాస్టర్‌గా ఉంటున్న చర్చిలోకి పరుగు పెట్టింది. అప్పటికే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. చర్చిలో జనం అంతా బయటకు వచ్చారు. ఎవరు ఎంత చెప్పినా కేతన్‌బాబు వినకుండా తల్లిపై వెళ్లడంతో జాన్‌బాబు కత్తితో అతన్ని పొట్టలో పొడిచాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని పెంటపాడు ఎస్ఐ స్వామి సిబ్బందితో పరిశీలించారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కాగా మృతుని భార్య, కుమారుడు అతనికి దూరంగా ఉంటున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆశ్రం ఆసుపత్రిలో ప్రత్యేక క్లినిక్‌లు ప్రారంభం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఈవో హనుమంతరావు

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆశ్రం ఆస్పత్రిలో పలు విభాగాల్లో స్పెషాలిటీ క్లినిక్‌లను ప్రారంభించినట్టు ఆశ్రం సీఈవో డాక్టర్ కె.హనుమంతరావు తెలిపారు. ఆశ్రం ఆసుపత్రిలో సోమవారం ప్రత్యేక క్లినిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రిక విధానంతో వచ్చే వ్యాధులు అన్ని వయసుల వారికి, మహిళలకు వచ్చే వ్యాధుల పట్ల సరైన అవగాహన కల్పించడమే తమ లక్ష్యమన్నారు. అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా ఆశ్రం డైరెక్టర్ రతీదేవి ప్రత్యేక క్లినిక్‌లకు అంకురార్పణ చేశారన్నారు. డాక్టర్లు డాక్టర్ సిద్ధేశ్వరి, డాక్టర్ వందన, డాక్టర్ మోహిత్, డాక్టర్ భరత్, డాక్టర్ రమేశ్, డాక్టర్ ప్రదీప్, సూపరిండెంటెండ్ డాక్టర్ హరీశ్‌గౌతమ్, డాక్టర్ శాంతయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, సీఓఓ రాజరాజన్, డాక్టర్ కృష్ణశేషాద్రి పాల్గొన్నారు.

ఇసుక చోరీ కేసులో ఆరుగురిపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):కుంచనపల్లి, ఆరుగొలను గ్రామాల్లో ఇసుక చోరీ కేసులో ఆరుగురిపై రూరల్ పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. కుంచనపల్లిలో 515 యూనిట్ల ఇసుక చోరీ చేశారని వీఆర్‌వో దూలపల్లి శాంత కుమారి ఫిర్యాదు చేయగా దండుబోయిన శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. ఆరుగొలనులో 515 యూనిట్ల ఇసుక చోరీపై వీఆర్‌వో పాలూరి దివ్య ఫిర్యాదుతో ఉప్పు నరసింహమూర్తి, మాసాబత్తుల సత్యనారాయణ, ఉప్పు దనుష్ తేజ, కోరి నాగేశ్వరరావు, దండుబోయిన వీరన్నలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

● అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలి

ఏలూరుటూటౌన్: అమ్మవారి దయ అందరి మీదా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పాండురంగాపురం గూడ్స్ షెడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలను ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. అ లాగే మినీ బైపాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సేవా శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



గ్రామ సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నాయకులు కే.సురేశ్ అన్నారు. కలెక్టరేట్ వద్ద గ్రామ సహాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ కేవలం 10500తో గౌరవ వేతనంతో పని చేస్తున్నామన్నారు. పార్ట్‌టైం ఉద్యోగులుగా పని చేస్తున్నామన్నారు. అర్హులైన వారిని క్రమబద్ధీకరించి ప్రమోషన్ కల్పించాలన్నారు. ఎస్ఎస్.శ్రీనివాస్, ఎం.షారోన్, తదితరులు పాల్గొన్నారు.



చింతమనేనికి కృతజ్ఞతలు చెబుతున్న మహిళలు

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి : చింతమనేని

పెదవేగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లోనూ అభివృద్ధిని సాధించి, ఆర్థికంగా ఎదిగితేనే సామాజిక వికాసం సాధ్యపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో సోమవారం పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను తెలుసుకున్న ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. దీంతో పలువురు మహిళలు ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త, నూజివీడు సీడ్స్ ఛైర్మన్, నూజివీడు నియోజకవర్గం, తుక్కులూరుకు చెందిన మండవ వెంకటరామయ్య మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవారం నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

టి.నర్సాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి యూనియన్ కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు చిన్ని తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో సోమవారం లూయిస్ డాగురే ఫొటో, వీడియోగ్రాఫర్ల యూనియన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చిన్ని చేతుల మీదుగా నూతన అధ్యక్షులు వాసు, ఉపాధ్యక్షులు మహారాజ్, కార్యదర్శి ప్రసాద్, సంయుక్త కార్యదర్శి మహేశ్, కోశాధికారి ఈశ్వర్, కార్యవర్గ సభ్యులు రవి, సునీల్, సాయిల చేతుల మీదుగా ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా కార్యదర్శి ప్రవీన్, కోశాధికారి మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ సూరిబాబు, జిల్లా కన్వీనర్ ఖాన్, అమీర్‌భాష, ప్రసాద్, శివాజీ, ఫెకల్టీ, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

దళితులకు సాగు పట్టాలివ్వాలని ఆర్డీవోకు వినతి

లింగపాలెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీసీహెచ్ఆర్‌పాలెంలో సర్వే నంబర్ 37-7లో ఉన్న 8.16 ఎకరాల భూమిని 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని దళితసేన అధ్యక్షుడు రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. లింగపాలెం మండలంలో టీసీహెచ్ఆర్‌పాలెంలో ఉన్న దళితులతో కలిసి ఆర్డీవో విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు.సాగులో ఉన్న దళితులకు పట్టాలు మంజూరు చెయ్యాలని కోరారు. బుల్లా రవికుమార్, భూసి అనీల్‌కుమార్, సుజన్ దళితనాయకులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై బొరగం శ్రీనివాసులు హర్షం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జీఎస్టీ సరళీకృత విధానాన్ని తీసుకు రావడం పట్ల ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. దీని ద్వారా రైతులు, రైతు అనుబంధ వ్యవసాయ పనిముట్లపై ఉన్న జీఎస్టీని తగ్గించడంతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ధరలు తగ్గితే కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కె.రామకృష్ణ, కె.నరేష్, మెట్ట బుచ్చిరాజు, కుందుల శ్రీను, వంకా కాంచనమాల, తీగల గోపాలకృష్ణ కూచిపూడి రమేష్, మనెల్లి బాలు పాల్గొన్నారు.



క్యాన్సర్ రకాలను ప్రదర్శిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

నర్సింగ్ కళాశాలలో క్యాన్సర్‌పై అవగాహన

దెందులూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారికి గుర్తుగా గులాబీ రంగును సూచిస్తారని, క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్యంతో పాటు మనోధైర్యం అవసరమని నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కాలేజీలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రోజ్ డేపై డేమో నిర్వహించి విద్యార్థులు 20 రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. బొమ్మలతో కూడిన చిత్రాలను విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించారు.

మొండి బకాయిలపై కొరడా

(5వ పేజీ తరువాయి)

పే అండ్ అక్కౌంట్స్ అధికారి వద్ద రూ.8 కోట్ల వరకు బకాయిలు గనుల శాఖవే ఉన్నట్లు చెబుతున్నారు. వీటిని త్వరలో గనులశాఖ అప్పగించి.. ప్రభుత్వానికి జమ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గనులశాఖకు వివిధ 16 చోట్ల బాల్‌క్లే, గ్రావెల్, మెటల్, ఇతర ఖనిజాల తవ్వకాల లీజుల ద్వారా ప్రధానంగా ఆదాయం సమకూరుతుంది. ఇందులో అక్కడక్కడ బకాయిలు పేరుకుపోయాయి. వాటిని వసూళ్ల చేయాల్సిందేనంటూ కలెక్టర్ ఆదేశించారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ : పాపారావు, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్



లీజుల బకాయిలను వేగవంతంగా వసూలు చేసేందుకు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తున్నాం. సీనరేజ్ ట్యాక్స్ ఎగొట్టకుండా పారదర్శకంగా వారి నుంచి వసూళ్ల చేపట్టేందుకు ప్రభుత్వ ఎస్ఎస్ఆర్ రేట్ల కింద జమ అయ్యేలా చూస్తాం. భవిష్యత్‌లో ఆన్‌లైన్ ద్వారా లీజుల కేటాయింపులకు మార్గం సుగమం అయ్యేలా చర్యలు చేపట్టాం.

జీఎస్టీ ఉత్తేజం!

(5వ పేజీ తరువాయి)

అమ్మకాలు చేపడుతున్నారు. కేజీ వెన్న, నెయ్యిల మీద రూ.30ల చొప్పున తగ్గింది. పాలు, పాల ఉత్పత్తుల ధరలు దిగి రానున్నాయి. పాల ధర లీటరుకు రూ.3 నుంచి 5 వరకూ తగ్గనున్నాయి. పాన్ మసాలా, స్వీట్ వాటర్, ఆల్కహాల్ లేని పానీయాలు, కార్బొనేటెడ్ పండ్ల పానీయాలు, పొగాకు ఉన్న ఉత్పత్తులు, సిగార్లు, సిగిరెట్, బొగ్గుతో తయారైన ఘన ఇంధనాలు పెరగాల్సి ఉంది. అయితే వీటికి కొంత సమయం పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

పాదరక్షలు,టీవీ షోరూమ్‌లు కిటకిట : పాదరక్షలు, షూలు రేట్లు తగ్గుముఖం పట్టడంతో యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు షూ దుకాణాలపై వైపు చూస్తున్నారు. షోరూమ్‌ల బయట జీఎస్టీ రేట్లు తగ్గాయి.. త్వరపడంటూ ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఓ చెప్పుల దుకాణంలో ధరలపై ఆరా తీయగా జీఎస్టీ రేట్లు తగ్గించిన మేర ఆయా బ్రాండెడ్ ఉత్పత్తులు ఇంకా రాలేదని.. ఇప్పుడున్న స్టాకుపై కొనుగోలు చేసిన వారికి 5 శాతం తగ్గించి అమ్మకాలు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టీవీ షోరూమ్‌లు కూడా కిటకిటలాడుతున్నాయి. 28 శాతం నుంచి 18 శ్లాబ్‌లోకి టీవీ, ఎల్ఈడీల ధరలు మారడంతో... ప్రముఖ కంపెనీలు ఇప్పుడున్న పాత స్టాకుపైనే 18 శాతం జీఎస్టీతోనే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ వారంలో ఈ అమ్మకాలు 30 శాతం నుంచి 50 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఎల్ఈడీ, ఎల్‌సీడీలపై రూ.2 నుంచి రూ.4వేల వరకు ధరల తగ్గాయి.

తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువులు : ఐఎఫ్‌బీ రకం ఆరు కేజీల కెపాసిటీ రూ.26 వేలది రూ.23,000కు, ఏసీ 1.5 టన్ను రూ.43,500 ఉన్నది రూ.38,500కు, డిష్ వాష్ 15 ప్లేసెస్‌ది రూ.52,000 ఉంటే ఇప్పుడు రూ.46,000 అమ్మకాలు జరిగాయి. ఇక 380 లీటర్ల కంటే ఎక్కువ కెపాసిటీ ఉన్న ఫ్రిజ్‌లకు జీఎస్టీ తగ్గింపు స్లాబ్‌లోకి వచ్చింది. 380 లీటర్లకు దిగువన ఉన్న వాటిలో జీఎస్టీలో వ్యత్యాసం లేదు.

జీఎస్టీపై కూటమి నేతలు ర్యాలీ : బీజేపీ ప్రభుత్వం హయాంలో జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ధరలు దిగి రానున్నాయని బీజేపీ, కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్ ఆధ్వర్యంలో నగరంలో పెద్దపోస్టాఫీసు నుంచి చందన బ్రదర్స్ వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పేదల కోసమే బీజేపీ ప్రభుత్వం ధరాఘాతం నుంచి విముక్తి కల్పించిందని విక్రమ్ కిషోర్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం అన్నారు. మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరళ్ల సుధాకర్‌కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, జ్యోతికుమార్, నడపన చిన భాస్కరరావు, కాశేశ్వరరావు, శేష శయన, మీడియా కన్వీనర్ బాడిత నారాయణ, ఎంపీసీ మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్ పాల్గొన్నారు.



నిడమర్రులో కొలువుదీరిన అమ్మవారి ప్రతిమ



గోపన్నపాలెంలో నారాయణప్రసాద్, దుర్గ దంపతులకు సన్మానం దృశ్యం



తాడిచర్లలో పూజలు చేస్తున్న సర్పంచ్ పార్థసారథిబాబు

పాహిమాం..

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో అమ్మవారి ఆలయాల వద్ద అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. సత్రంపాడులోని అంబికా దేవి అమ్మవారిని, సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవార్లను బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● పెదపాడు:మండలంలో దసరా వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి.పెదపాడు, రామచంద్రపురం, నాయుడుగూడెం గ్రామాలతో పాటు పలు చోట్ల అమ్మవార్ల ప్రతిమలు నెలకొల్పి విశేషాలంకరణలతో పూజలు నిర్వహించారు. సోమవారం బాలా త్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

● దెందులూరు: మండలంలోని గోపన్నపాలెం గ్రామంలో కనక దుర్గమ్మ ఆలయ 35వ వార్షిక శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలను టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, మాజీ సర్పంచ్ మాగంటి తారకక దుర్గ దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. సోమవారం గోపన్నపాలెం పంచాయతీ కార్యాలయ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో కమిటీ సభ్యులు కొండేటి హనుమంతు, తోట రామకృష్ణ ఆధ్వర్యంలో మిల్లు బాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలను ప్రారంభించారు. ఉత్సవాల నిర్వహణకు రూ.25 వేలను మిల్లుబాబు దంపతులు కమిటీకి అందజేశారు. గ్రామాభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న దంపతులను కమిటీ సభ్యులు ఏనుగు శ్రీను, బజారు గణేశ్, చింతా సుబ్బారావు, ఏనుగు అచ్చారావు, చమ్మల మూడి రాము, బొర్రా చందు, ఆలపాటి హేమలు గజమాలతో ఘనంగా సన్మానించారు.

● టి.నర్సాపురం: దేవీ నవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని మండపాల్లో పలు చోట్ల ఏర్పాటు చేసిన అమ్మవారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం అనేక ప్రాంతాల్లో కనకదుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్టించి భక్తులు, కమిటీవారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్యం

మండపాల్లో కొలువుదీరిన దుర్గమ్మ

దేవత గుబ్బల మంగమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వాడలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, టీడీపీ మండలాధ్యక్షుడు మొగపర్తి సోంబాబు పాల్గొన్నారు. రెడ్డిగణపవరం, బుట్టాయగూడెం త్రిశక్తి పీఠంలో ఏర్పాటు చేసిన అమ్మవార్లు మొదటి రోజున శ్రీ బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● పోలవరం: మండలంలో దసరా వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ బస్ షెల్టర్ కనకదుర్గ ఆలయం, నూతనగూడెం, కృష్ణారావుపేట, బంగారమ్మపేట కనకదుర్గ ఆలయాల్లో, పట్టిసీమ మంగళ చండికాదేవి, కనకదుర్గమ్మ ఆలయాలు, కొత్తపట్టిసీమ కనకదుర్గ, రామాలయంలో కనకదుర్గమ్మ ప్రతిమలు నెలకొల్పారు. మహిళలు ఉదయానే గోదావరి జలాలతో అమ్మవారికి కలశాభిషేకాలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో భవానీ దీక్ష భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామపారాయణం చేశారు.

● చింతలపూడి: చింతలపూడిలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు పలుచోట్ల ఘనంగా ప్రారంభమయ్యాయి. దివాణం వీధిలో ఏర్పాటు చేసిన శిబిరంలో అమ్మవారికి తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ జరిపి పూజలు నిర్వహించారు. విశ్వనాథ మఠం, వేగి లింగేశ్వరస్వామి ఆలయం, ప్రగడవరం కనకదుర్గ ఆలయం, సీతానగరంలోని దుర్గాదేవి ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి పూజలు జరిపారు.

● వేలేరుపాడు: దసరా మహోత్సవాల్లో భాగంగా వేలేరుపాడులోని సంతమార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారు కొలువై భక్తులకు కనువిందు చేశారు.

● భీమడోలు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలోని వాడవాడలా ఘనంగా ప్రారంభమయ్యాయి. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన ఆలయాలతో పాటు దసరా సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమడోలులో ఏలూరు గోదావరి కాలువగట్టుపై ఉన్న కనకదుర్గమ్మ, గుండుగొలనులో శ్రీ భ్రమరాంభ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభించారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి 22వ దసరా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఆలయ మండపంలో ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీవాసవీ అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన శ్రీ గురుసాయి స్వీట్స్ యజమాని చిట్లూరి దివాకర్ బాబు అమ్మవారికి 22 కిలోల లడ్డూను సమర్పించగా ఉత్సవ కమిటీ ఛైర్మన్ టీవీఏ తారకం సత్కరించారు.

● జంగారెడ్డిగూడెం: దసరా నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత గంగానమ్మ మొదటి రోజు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వగ్వాల పుల్లారావు, విజయదుర్గ దంపతులు కలశపూజతో దసరా ఉత్సవాలను ప్రారంభించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కలగర వీర్రాజు తెలియచేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

● నిడమర్రు: దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు బాలత్రిపురసుందరీ అలంకరణలో భక్తుల పూజలు అందుకున్నారు. మండలంలోని మందలపర్రు, భువ్వనపల్లి, నిడమర్రు, పెదనిండ్రకొలను గ్రామాలలో గల దుర్గమ్మ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భువ్వనపల్లిలో ట్రాక్టర్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 13వ దుర్గమ్మ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి ప్రతిమను మండపంలో ఏర్పాటు చేశారు.

● కామవరపుకోట: తాడిచర్లలో సోమవారం శివాలయం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెలకొల్పి దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించగా సర్పంచ్ పసుమర్తి పార్థసారధిబాబు పాల్గొన్నారు. స్థానిక లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి లలితా పరమేశ్వరిదేవిగా అలంకరించి మేళతాళాలు, బాజాభజంత్రీలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

● జీలుగుమిల్లి: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకని జీలుగుమిల్లి జగదాంబ ఆలయంలో అర్చకులు పి.ప్రసాద్, కె.చిరంజీవిశర్మలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి 108 కలువ పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద గీతా మందిరంలో మహిళా భక్తులు లలితా సహస్రం పఠించారు.





అమ్మవార్ల అలంకరణలో శ్రీశ్రీ విద్యార్థినులు... బతుకమ్మ ఆడుతున్న శర్వాణీ విద్యార్థినులు

పాఠశాలల్లో దసరా వేడుకలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో దసరా, బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. నవదుర్గల వేషధారణల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు. శ్రీశ్రీ విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎం.బి.ఎస్.శర్మ మాట్లాడుతూ శక్తిఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే పండుగగా దసరాను జరుపుకుంటామన్నారు. స్కూలు ఏవోలు దివ్య, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తంగెళ్లమూడి శ్రీసూర్య హైస్కూల్లో విద్యార్థినులు 11 అమ్మవార్ల అవతారాల అలంకరణలో దసరా పండుగ విశిష్టతపై సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఆర్ఆర్ పేట శ్రీశర్వాణీ హైస్కూల్లో మహిషాసుర మర్దిని, నవదుర్గల వేషధారణలు, బతుకమ్మ నృత్యప్రదర్శనలతో బాలబాలికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రామలీలను ప్రదర్శించారు. స్కూలు హెచ్ఎం సత్యశారద, డైరెక్టర్ మదనమోహనరాజు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య శిబిరాలు

పెదపాడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు బాగుంటాయని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టరు చక్రధర్, అనంతపాల్‌లు తెలిపారు. పెదపాడు పీహెచ్‌సీ ఆవరణలో స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో మహిళలకు సంబంధించి అనేక వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కూటమి నాయకులు గుత్తా అనిల్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్వస్థ్‌నారీ సశక్తి కార్యక్రమంలో 185 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహిళలకు వచ్చే వైద్య పరీక్షలు డాక్టర్ నరేష్, డాక్టర్ గీత నిర్వహించారు. అర్బన్




బండివారిగూడెంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

హెల్త్ సెంటర్ అభివృద్ధి కమిటీ ఛైర్‌పర్సన్ సొంగా యేసుపాదం ప్రారంభించారు.

● టి.నర్సాపురం: మహిళలు ప్రత్యేక వైద్యశిబిరాలు వినియోగించుకోవాలని బండివారిగూడెం పంచాయతీ సర్పంచ్ నాళం శిరీష తెలిపారు. బండివారిగూడెం సబ్‌హెల్త్ సెంటర్ పరిధిలో మండల వైద్యాధికారిణి కల్పానరాణి ఆధ్వర్యంలో సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు నాళం పూర్ణకాశీ విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎల్.నాగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్‌కే.రాజు పాల్గొన్నారు.

● జీలకర్రగూడెంలో వైద్య పరీక్షలు

కామవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా అక్టోబర్ రెండవ తేదీ వరకు జరిగే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. సోమవారం కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీలోని జీలకర్రగూడెం సొసైటీవద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. గ్రామంలోని మహిళలకు వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రేగుంట సురేశ్, కామవరపుకోట మండలాధ్యక్షులు ఎస్ఎస్ఆర్ఎల్ఎస్ఎన్ రాజు, సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం అంజిమూర్తి, ఏలూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బేతిన వెంకట్రావులతో పాటు నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



స్వస్థ్ నారీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కుక్కునూరు ఎంఈవోగా కృష్ణ ప్రసాద్

కుక్కునూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారిగా ఎం.కృష్ణప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విఘ్నేశ్వరపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఎం.కృష్ణప్రసాద్ ఉపాధ్యాయుడిగా ఉంటూ ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు బుట్టాయగూడేనికి చెందిన టి.బాబూరావు విధులు నిర్వహించారు.

నేడు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

భీమడోలు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పద్మావతిదేవి తెలిపారు. భీమడోలు-1 నంబరు సచివాలయం, పోలసానపల్లి, దుద్దేపూడి సచివాలయాల్లో ఆధార్ నమోదు జరుగుతుందన్నారు.

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి

పెదవేగి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చేతుల పరిశుభ్రతే ఆరోగ్యమని, ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రత పాటించాలని వేగివాడ సర్పంచ్ పంది ప్రభావతీ సూర్యచంద్రరావు అన్నారు. చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెదవేగి మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేతుల పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించారు.

బండి రామకృష్ణకు సంతాపం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు బండి రామకృష్ణ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో సోమవారం ఆయన సంతాప సభను నిర్వహించారు. రామకృష్ణ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు

ప్రపంచ శాంతి కోసం ధ్యానం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా ప్రశాంతత పొందవచ్చని అప్పుడే సర్వమానావళి ఆరోగ్యంగా ఉంటారని మాజీ జెడ్పీటీసీ, లైన్స్ క్లబ్ అధ్యక్షురాలు మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ప్రపంచ శాంతికోసం సోమవారంసైతం స్థానిక పిరమిడ్‌లో ధ్యానం చేసినట్లు ఆమె తెలిపారు. మూడో ప్రపంచయుద్ధం వంటిది రాకూడదని కోరుకుంటూ ధ్యానం చేసామన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి రాయుడు బాబు, డా. ప్రతాప్, సాంబశివరావు తదితరులుపాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న దాతలు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

టి.నర్సాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెడ్లం గ్రామానికి చెందిన కేతిరెడ్డి సీతారామరెడ్డి చంద్రకాంతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కేతిరెడ్డి వీరారెడ్డి(చినబాబు) సోమవారం మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల తెడ్లం గ్రామానికి చెందిన పెరవలి సరోజిని శీలం పెద్దింట్లు, అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించిన వీరారెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేతిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పది గంటల పనిదినాలు రద్దు చేయాలి

» సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు కార్పొరేషన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పని దినం స్థానంలో పది గంటల పని దినం బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పాతబస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారన్నారు. కార్మికుల కనీస వేతన జీవోలు సవరించాలని ఎంతోకాలంగా కార్మిక సంఘాలు కోరుతున్నా పట్టించుకోకుండా పని దినాలు సవరించడం ఏమిటన్నారు. సీఐటీయూ నాయకులు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని ధర్నా

కామవరపుకోట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని కొండగూడెంలో తరతరాలుగా నివాసం ఉంటున్న నాయక సామాజిక వర్గానికి ఎస్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరుతూ కొండగూడెం గ్రామానికి చెందిన నాయక సామాజికవర్గ యువత సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ గెడ్డం ఎలీషాకు సమర్పించారు. తొలుత కొండగూడెం నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఇంటర్వ్యూ..

సొసైటీని అభివృద్ధి చేస్తాం

పూజారి వెంకటరత్నం నాయుడు, సొసైటీ అధ్యక్షుడు, గాలాయగూడెం



● గాలాయగూడెం సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాలెన్ని?

నాగులదేవునిపాడు, సానిగూడెం, కొత్తపల్లి, వేగవరం, గోపన్నపాలెం, మసీదు పాడు, చల్లపల్లి పరిధిలో 3 వేల మంది రైతులు బ్యాంక్ ఖాతాదారులుగా ఉన్నారు.

● రైతులకు ఎంతమేరకు రుణాలిచ్చారు?

సొసైటీ పరిధిలో రూ.30 కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతోంది. ఈ ఏడాది రూ.కోటి రూపాయల రుణాలు అందించాం.

● యూరియా అందుబాటులో ఉందా?

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని సహకారంతో సీజన్ ప్రారంభంలోనే యూరియా తో పాటు అన్ని ఎరువులు అందుబాటులో ఉంచాం.

● ఫిక్సిడ్ డిపాజిట్లు ఎంత ఉన్నాయి..

బ్యాంక్ పరిధిలో రూ.7 కోట్ల వరకు ఫిక్సిడ్ డిపాజిట్‌లు ఉన్నాయి.

● మీ లక్ష్యం ఏమిటి?

రైతులు ఇబ్బందులు పడకుండా సహకార సొసైటీ ద్వారా పెట్టుబడి సాయం అందించి, సొసైటీని అభివృద్ధిపథంలో నడుపుతాం.

● సొసైటీ ద్వారా ఏమి అందిస్తున్నారు?

వేసవిలో చలివేంద్రాలతో పాటు ప్రభుత్వ నిత్యావసర సరుకుల పంపిణీ నిర్వహిస్తున్నాం.

(దెందులూరు, ఆంధ్రజ్యోతి)

24న ఏపీటీఎఫ్ జిల్లా సమావేశం

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్-1938 జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 24న ఉదయం 10గంటలకు ఏలూరులోని పంచాయతీరాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ జిల్లా నాయకులు రామ్మోహన్, మోహన్ తెలిపారు. ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి, కె.సుబ్బారెడ్డి, తదితర నాయకులు పాల్గొంటారని వివరించారు. ఉపాధ్యాయులంతా హాజరుకావాలని కోరారు.

దుమ్ము నుంచి రక్షించండి

చింతలపూడి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ మెయిన్ రోడ్డులో దుమ్ము నుంచి ప్రజలను కాపాడాలని తంటేపూడి ఫౌండేషన్ బహుజన వెల్ఫేర్ సంస్థ నిర్వాహకుడు వరప్రసాద్ మునిసిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వాహనాలు వెళ్తున్న సమయంలో దుమ్ము లేస్తోందని, ఈ కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని దుకాణదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. దీనికి మునిసిపల్ కమిషనర్ స్పందించి ఈ నెల 30వ తేదీలోగా దుమ్ము తొలగించి సమస్య పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు.

అక్రమ కట్టడాలు అడ్డుకోవాలి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు అధికారులను డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలను మూడు నెలలకు ఒకసారి గుర్తించి ఆరు నెలలకు ఒకసారి తొలగించే కార్యక్రమాలు చేపట్టాలని సుప్రీంకోర్టు, హైకోర్టులు అధికారులను ఆదేశించినా ఏజెన్సీలో అమలు కావడం లేదన్నారు. స.హ. చట్టంలో ఎటువంటి అక్రమ కట్టడాలు గుర్తించలేదనడం కోర్టులను ధిక్కరించడమే అని అన్నారు.

హమాలీలకు వేతనాలు చెల్లించాలి

కుక్కునూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హమాలీల 3నెలల వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వైసాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్న హమాలీలకు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని అన్నారు. కారం రమేశ్, తిరుపతయ్య, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

లింగపాలెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లింగపాలెంలో ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ద్విచక్రవాహనదారులు లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. భారీశబ్దం చేసే సైలెన్సర్లు ఉండకూడదన్నారు. ఈ తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమ్మవారి దయ పట్టణ ప్రజలందరిపై ఉండాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో దసరా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీ, ఆటో నగర్, ఎన్టీఆర్ నగర్, సిటీ కేబుల్ కార్యాలయం వద్ద,ఆంధ్ర పాపారాయుడు సెంటర్, హెడ్ పోస్టాఫీసు వద్ద పూజలు నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సంబూరి రామచంద్రరాజు, పెనుమర్తి రామకుమార్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, కోనేటి చంటి, కరణం రాంబాబు, కొంచాడ ప్రసాద్,గద్దె జశ్వంత్ పాల్గొన్నారు.

రేపు లోక్ కల్యాణ్ మేళా

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నూజివీడు షాదీఖానాలో లోక్‌కల్యాణ్ మేళాను బుధవారం నిర్వహిస్తున్నట్టు నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి తెలిపారు. నూజివీడు మున్సిపల్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో చిన్న వ్యాపారులైన మహిళలకు రుణసౌకర్యం, డిజిటల్ పేమెంట్‌లపై శిక్షణ, ఇతర స్కీమ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అర్హులకు రుణాల పంపిణీ జరుగుతుందన్నారు.

మద్యం దుకాణం తరలించాలని ధర్నా

నూజివీడు టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరం లిక్కర్‌షాపు వల్ల ఆకతాయిల చేష్టలతో మహిళలు, విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురి అవ్వాల్సి వస్తోందంటూ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామస్తులు నూజివీడు ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ తక్షణం లిక్కర్‌షాపును ఈ ప్రాంతం నుంచి తరలించాలన్నారు. సీపీఐ నాయకులు ఆకునూరి విజేష్, బాధిత మహిళలు పాల్గొన్నారు.


నూజివీడు సీడ్స్ అధినేత మండవ వెంకట రామయ్య మృతి చెందడంతో తుక్కులూరులో ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

పోలీసు నుంచి టీచర్లుగా

» నలుగురు కానిస్టేబుళ్లను సత్కరించిన ఏలూరు ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి):అంకిత భావంతో పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీ శివకిశోర్ సూచించారు. పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న యు.శ్రీనివాసరావు(పీసీ 1478), ఎం.సుబ్రహ్మణ్యం (2435), ఎస్.వనజారాణి (డబ్ల్యుపీసీ 976), పి.అఖిల శ్రావణి (డబ్ల్యుపీసీ 4274) ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారు. వీరిని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాల యంలో సోమవారం ఎస్పీ సత్కరించి బహుమతులు అందించారు. ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కష్టం వస్తే అధైర్య పడవద్దు

ప్రతి ఒక్కరికి కష్టసుఖాలు ఉంటాయని కష్టం వచ్చింది కదాని ఆత్మహత్య చేసుకుంటే వారి బంగారు భవిష్యత్తు, వారిపై ఆధారపడిన వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని ఎస్పీ కిశోర్ అన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక మహిళ ఈ ఏడాది మే 23న ఏలూరు ఎన్ఆర్ పేట రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా స్థానికులు డయల్ 112కు సమాచారం అందించడంతో శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది ఆమెను కాపాడారు. తర్వాత ఆమె పట్టుదలతో చదివి డీఎస్సీలో ఉద్యోగం పొందడంతో ఆమెను ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు.

మహిళ కృతజ్ఞతలు

జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న తనను శక్తి టీం కాపాడి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పట్టుదలతో చదివి డీఎస్సీలో ఉద్యోగం పొందానని తన ఉన్నతికి దోహదపడిన శక్తి దళ సభ్యులకు, జిల్లా పోలీసు అధికారులకు జీవిత కాలం రుణపడి ఉంటానని ఆ మహిళ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. శక్తి టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం. సుబ్బారావు, మహిళా ఎస్ఐ నాగమణి, శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయులుగా ఎంపికైన కానిస్టేబుళ్లను సన్మానించిన ఎస్పీ కిశోర్

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

నూజివీడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో కాలనీ వాసులు ధర్నా నిర్వహించి, సబ్ కలెక్టర్ వినూత్నకు వినతిపత్రాన్ని అందించారు. సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలతో బలవంతంగా గృహాలను నిర్మింపజేశారని, మౌలిక సదుపాయాలు కల్పించలేదని, తక్షణం వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

గ్రామ సభలు సక్రమంగా నిర్వహించాలి

మండవల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 2 నుంచి గ్రామసభలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ అప్పారావు తహసీల్దార్ గోపాల్‌కు సోమవారం అర్జీ అందజేశారు. అధికారుల తీరు వల్ల ప్రజలు గ్రామసభల వైపు కన్నెత్తి చూడడం లేదని, మౌలిక వసతులు ఏర్పడడం లేదన్నారు. గ్రామ సభలకు 20 రోజులు ముందుగా షెడ్యూల్‌ను తయారు చేసి ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉండగా 1, 2 రోజులు ముందు మాత్రమే షెడ్యూల్‌ను తయారు చేస్తున్నారని విమర్శించారు.

స్వచ్ఛ కోరుకొల్లే లక్ష్యం : సర్పంచ్

కలిదిండి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టినట్టు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ అన్నారు. సోమవారం కోరుకొల్లులో అంతర్గత రహదారులపై పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించారు. డ్రెయినేజీల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లారు. స్వచ్ఛ కోరుకొల్లుగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని సర్పంచ్ అన్నారు. కార్యదర్శి రాఘవేంద్రరావు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

పని గంటల పెంపుపై నిరసన

నూజివీడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పని గంటలు పెంచుతూ రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.రాజు అన్నారు. నూజివీడు చిన్నగాంధీబొమ్మ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రతి ఆటో కార్మికునికి షరతుల్లేకుండా వాహనమిత్ర అమలు చేయాలన్నారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి కామినేని పాలాభిషేకం



కైకలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. జీఎస్టీ తగ్గించినందుకు సోమవారం కైకలూరులో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గుదలతో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్లు, బైక్‌లు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గుదలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కూటమి నేతలు కీర్తి వెంకటరామ్ ప్రసాద్, బోడావుల రాజేష్, గంగుల ఏసురాజు, బలే చిరంజీవి, వేగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు వాటర్ ట్యాంకర్ వితరణ



ఆగిరిపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు తోటపల్లి గ్రామస్థులకు ఉచిత మంచినీటి ట్యాంక్‌ను తన తండ్రి బెజవాడ సీమయ్య ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని అందజేశారు. దాతకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. దాత రాంబాబు కుటుంబీకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వైరింగ్ సామగ్రి అందజేత

చాట్రాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): చనుబండ గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కోసం ఇటీవల ప్రభుత్వం కంప్యూటర్లను సరఫరా చేసింది. అయితే విద్యుత్ వైరింగ్ చేసి కంపూటర్లు పని చేయించటానికి నిధులు లేక శిక్షణలో జాప్యం జరుగుతోంది. దీంతో బీజేపీ నాయకులు బజ్జూరి గోపీకృష్ణ, నెక్కలపు వెంకటేశ్వరరావు, కొత్తగుండ్ల రమేష్, షేక్ రహీం, విద్యాధరరెడ్డి, శెట్టి శ్రీనివాసరావు, ఆదిమూలం శర్మ సోమవారం వైరింగ్ సామగ్రిని లైబ్రేరియన్ శ్రీకాంత్‌కి అందజేశారు.

సేవా కమిటీ సభ్యుడిగా నాగరాజు

ముదినేపలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి (కనకదుర్గమ్మ) దేవస్థానం సేవా కమిటీలో ముదినేపల్లి మండలం అల్లూరుకు చెందిన తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజుకు చోటు దక్కింది. సేవా కమిటీ సభ్యుడిగా నాగరాజును నియమిస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన కమిటీ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత ఏడాది కూడా సేవా కమిటీ సభ్యుడిగా నాగరాజు బాధ్యతలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	244
చికెన్ స్కిన్‌లెస్	254
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

రాజేష్ కుటుంబాన్ని ఆదుకుంటాం

మంత్రి సారథి

చాట్రాయి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి ఆదివారం మృతి చెందిన మండలంలోని పర్వతాపురం వాసి చొప్పరపు రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. సోమవారం పర్వతాపురం గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొర్రా నాగేశ్వరరావుకు మంత్రి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకొని, మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడు రాజేష్‌కు టీడీపీ సభ్యత్వ కార్డు ఉన్నందున బీమా సొమ్ము రూ. 5 లక్షలు తక్షణమే అందేలా చర్యలు తీసుకుంటామని, సీఎంఆర్ఎఫ్ నుంచి కూడా సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు.

కిడ్నీ వ్యాధికి వైద్య ఖర్చులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

ముదినేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి వైద్య ఖర్చులను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ముదినేపల్లి మం డలం కోడూరుకు చెందిన ఉచ్చుల రాయప్ప (56) ఆరే ళ్ల క్రితం కుటుంబంతో సహా విజయవాడ వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి భార్యా పిల్లలు వున్న కొద్దిపాటి సొమ్ము ఖర్చు పెడుతుండడంతో రాయప్ప మనోవేదనకు గురై ఈ నెల 21న కోడూరు వచ్చి ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మ హత్య కు పాల్పడ్డాడు. గ్రామస్థులు ఆయనను గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

కోడి పందేలపై దాడి

బొమ్మినంపాడులో కోడిపుంజులకు కత్తులు కట్టి నిర్వహిస్తున్న కోడిపందేలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించి ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో పందేల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని రెండు కోడి పుంజులు, రూ. 3050 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి

ముసునూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలతోపాటు సమాజం అభివృద్ధి చెందుతుందని సర్పంచ్ విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. సోమవారం ముసునూరు పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి జనరల్ సర్జన్ దినేష్, పీహెచ్‌సీ వైద్యులు షకీనా ఇవాంజలి 240 మందికి పలు వైద్య పరీక్షలు చేశారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు : కామినేని

కైకలూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీమహాయాగ సహిత శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆలయంలో గోపూజ చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీశ్యామలాంబ అమ్మవారు బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మొదటిరోజే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా కైకలూరు అలరారుతోందని ఒకేచోట ఆలయాలు ఉండడం ఈ ప్రాంతానికి వన్నె తెచ్చాయన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏ విధమైన ఏర్పాట్లు కావల్సినా తక్షణమే ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నాయకులు నర్సిపల్లి అప్పారావు, బీకేఎం నాని, అంద్రాజు శ్రీనివాసరావు, పూల రామచంద్రరావు, పేరిచర్ల ప్రసాదరాజు, పైడిపాటి శివశంకర్, నల్లగోపుల చలపతి, వీరాబత్తిన సుధా, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయాధికారి వీఎన్‌కె శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యాకుమారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


శ్రీశ్యామలాంబ అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కొల్లేటికోటలో...

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీచక్రార్చన, లలితా సహస్రనామ కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉభయ దాతల పూజల్లో భుజబలపట్నం గ్రామానికి చెందిన ముదునూరి రామలింగరాజు దంపతులు పూజలు చేశారు. ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఆధ్వర్యంలో ఏర్పాట్లను నిర్వహించారు.

తల్లిదండ్రులు మందలించారని..

ఇంటి నుంచి పారిపోయిన ముగ్గురు బాలికలు గంటల వ్యవధిలో పట్టుకున్న పోలీసులు

ముదినేపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి పారిపోయిన ముగ్గురు బాలికల ఆచూకీని గంట ల వ్యవధిలోనే కనిపెట్టి ముదినేపల్లి పోలీసులు శభాష్ అనిపించుకున్నారు. గురజలో ఓ మహిళ తమ ఇంట్లో బీరువాలో డ్వాక్రా గ్రూపు సొమ్ము రూ. 9 వేలు దాచి ఉంచింది. దీనిని చూసిన ఆమె కుమార్తె, పక్కనే ఉంటున్న ఆమె అక్క ఇద్దరు కుమార్తెలు కలిసి రూ.4 వేలు తీశారు. వారు సొమ్ము తీశారని తెలిసి తల్లిదండ్రులు గట్టిగా మందలించడంతో ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు ఎవరికి చెప్పకుండా గురజ నుంచి వెళ్లిపోయారు. తమ కుమార్తెల అదృశ్యంపై ఇద్దరు మహిళలు ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు పవన్, నాగబాబు వారి కోసం వెతుకుతూ విజయవాడ రైల్వే స్టేషన్‌కు ఆదివారం రాత్రి వెళ్లారు. తిరుపతి వెళ్ళే రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫారమ్‌పై సిద్ధంగా వున్న ఆ బాలికలు కనిపించగా వారిని అదుపులోకి తీసు కుని వారి తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు కానిస్టేబుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురు బాలికలను క్షేమంగా తీసుకువచ్చి వారి తల్లి దండ్రులకు అప్పగించినందుకు ఎస్ఐ వీరభద్రరావు, కానిస్టేబుళ్ళు పవన్, నాగబాబు లను ఎస్పీ కిశోర్ సోమవారం అభినందించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ ముదినేపల్లి కానిస్టేబుళ్లను అభి నందిస్తూ వారు చూపిన చొరవ ప్రశంసనీయ మని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, రేపల్లె బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... **దండాబత్తిన శివ** గారి భార్య **దండాబత్తిన రాణి** గారి ఆస్తిని తనఖా పెట్టుకొని **దండాబత్తిన శివ** గారు ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు **దండాబత్తిన శివ** గారికి ఋణం మంజూరు చేయును. **షెడ్యూలు** : కృష్ణా జిల్లా, చల్లపల్లి సబ్ డి॥ యిలాకా, బోగిరెడ్డిపల్లి గ్రామ పంచాయితీ ఏరియాలోని బోగిరెడ్డిపల్లి గ్రామ డోర్ నెం. 1-65యగా గల బోగిరెడ్డిపల్లి గ్రామ ఆర్.యస్.నెం. 154-1రు య. 12-05ట్లలో నాకు హక్కు కలిగి సీకు దఖలు పరచిన చ॥గ॥ 170ల స్థిరాస్తి నివేశన స్థలము, సదరు స్థలములో నిర్మించబడిన ఆర్.సి.సి. ఇల్లు వగైరాలతో సహా గల ఆస్తికి హద్దులు. **తూర్పు** : బాతుల అంకాలు గారి ఆస్తి హద్దు, **దక్షిణం** : దండాబత్తిన సుబ్రమణ్యం గారి ఆస్తి హద్దు, **పడమర** : పంచాయితీ రోడ్డు హద్దు, **ఉత్తరం** : దండాబత్తిన కృష్ణ గారి ఆస్తి హద్దు. యీ హద్దుల మధ్య చ॥గ॥ 170లు స్థలం లేక చ॥మీ 142.8లు స్థిరాస్తి నివేశన స్థలమున్నూ, సదరు స్థలములో 2 సంవత్సరముల క్రితము నిర్మించబడిన చ॥అ॥ 170లు ప్లింత్ ఏరియా గల ఆర్.సి.సి. ఇల్లు, చ॥అ॥ 120లు ప్లింత్ ఏరియా గల ఎ.సి.సి. వసారా, DOC NO : 6944/2024, S.R.O. చల్లపల్లి.

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ,
న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు.
సెల్ నెం.9030595227, 9848052914

మొండి బకాయిలపై కొరడా

(5వ పేజీ తరువాయి)

పే అండ్ అక్కౌంట్స్ అధికారి వద్ద రూ.8 కోట్ల వరకు బకాయిలు గనుల శాఖవే ఉన్నట్లు చెబుతున్నారు. వీటిని త్వరలో గనులశాఖ అప్పగించి.. ప్రభుత్వానికి జమ చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గనులశాఖకు వివిధ 16 చోట్ల బాల్‌క్లే, గ్రావెల్, మెటల్, ఇతర ఖనిజాల తవ్వకాల లీజుల ద్వారా ప్రధానంగా ఆదాయం సమకూరుతుంది. ఇందులో అక్కడక్కడ బకాయిలు పేరుకు పోయాయి. వాటిని వసూళ్ల చేయాల్సిందేనంటూ కలెక్టర్ ఆదేశించారు.

కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ

పాపారావు, గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్



లీజుల బకాయిలను వేగవంతంగా వసూలు చేసేందుకు కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేస్తున్నాం. సీనరేజ్ ట్యాక్స్ ఎగ్గొట్టకుండా పారదర్శకంగా వారి నుంచి వసూళ్లు చేపట్టేందుకు ప్రభుత్వ ఎస్ఎస్ఆర్ రేట్ల కింద జమ అయ్యేలా చూస్తాం. భవిష్యత్‌లో ఆన్‌లైన్ ద్వారా లీజుల కేటాయింపులకు మార్గం సుగమం అయ్యేలా చర్యలు చేపట్టాం.

జీఎస్టీ ఉత్తేజం!

(5వ పేజీ తరువాయి)

అమ్మకాలు చేపడుతున్నారు. కేజి వెన్న, నెయ్యిల మీద రూ.30ల చొప్పున తగ్గింది. పాలు, పాల ఉత్పత్తుల ధరలు దిగి రానున్నాయి. పాల ధర లీటరుకు రూ.3 నుంచి 5 వరకూ తగ్గనున్నాయి. పాన్ మసాలా, స్వీట్ వాటర్, ఆల్కహాల్ లేని పానీయాలు, కార్బొనేటెడ్ పండ్ల పానీయాలు, పొగాకు ఉత్పత్తులు, సిగార్లు, సిగరెట్, బొగ్గుతో తయారైన ఘన ఇంధనాలు పెరగాల్సి ఉంది. అయితే కొంత సమయం పడుతుందంటున్నారు వ్యాపారులు

పాదరక్షలు,టీవీ షోరూమ్‌లు కిటకిట

పాదరక్షలు, షూలు రేట్లు తగ్గుముఖం పట్టడంతో యువతతో పాటు అన్నివర్గాల ప్రజలు షూ దుకాణాలపై వైపు చూస్తున్నారు. షోరూమ్‌ల బయట జీఎస్టీ రేట్లు తగ్గాయి.. త్వరపడండూ ఫ్లెక్సీలు, బ్యానర్లు వెలిశాయి. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని ఓ చెప్పుల దుకాణంలో ధరలపై ఆరా తీయగా జీఎస్టీ రేట్లు తగ్గించిన మేర ఆయా బ్రాండెడ్ ఉత్పత్తులు ఇంకా రాలేదని... ఇప్పుడున్న స్టాకుపై కొనుగోలు చేసిన వారికి 5 శాతం తగ్గించి అమ్మకాలు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. టీవీ షోరూమ్‌లు కూడా కిటకిటలాడుతున్నాయి. 28 శాతం నుంచి 18 శ్లాబ్‌లోకి టీవీ, ఎల్ఈడీల ధరలు మారడంతో... ప్రముఖ కంపెనీలు ఇప్పుడున్న పాత స్టాకుపైనే 18 శాతం జీఎస్టీతోనే సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఈ వారంలో ఈ అమ్మకాలు 30 శాతం నుంచి 50 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఎల్ఈడీ, ఎల్‌సీడీలపై రూ.2 నుంచి రూ.4వేల వరకు ధరల తగ్గాయి.

తగ్గిన ఎలక్ట్రానిక్ వస్తువులు

ఐఎఫ్‌బీ రకం ఆరు కేజీల కెపాసిటీ రూ.26 వేలది రూ.23,000కు, ఏసీ 1.5 టన్ను రూ.43,500 ఉన్నది రూ.38,500కు, డిష్ వాష్ 15 ప్లేసెస్‌ది రూ.52,000 ఉంటే ఇప్పుడు రూ.46,000 అమ్మకాలు జరిగాయి. ఇక 380 లీటర్ల కంటే ఎక్కువ కెపాసిటీ ఉన్న ఫ్రిజ్‌లకు జీఎస్టీ తగ్గింపు స్లాబ్‌లోకి వచ్చింది. 380 లీటర్లకు దిగువన ఉన్న వాటిలో జీఎస్టీలో వ్యత్యాసం లేదు.

జీఎస్టీపై కూటమి నేతలు ర్యాలీ

బీజేపీ ప్రభుత్వం హయాంలో జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ధరలు దిగి రానున్నాయని బీజేపీ,కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ కిశోర్ ఆధ్వర్యంలో నగరంలో పెద్దపోస్టాఫీసు నుంచి చందన బ్రదర్స్ వరకు సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పేదల కోసమే బీజేపీ ప్రభుత్వం ధరాఘాతం నుంచి విముక్తి కల్పించిందని విక్రమ్ కిషోర్, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం అన్నారు. మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొరళ్ల సుధాకర్‌కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, జ్యోతికుమార్,నడపన చిన భాస్కరరావు, కాళేశ్వరరావు, శేష శయన, మీడియా కన్వీనర్ బాడిత నారాయణ, ఎంపీసీ మాజీ చైర్మన్ పూజారి నిరంజన్ పాల్గొన్నారు.